

(కర్నూలు-ఆంధ్రజ్యోతి): మూడు నెలల్లో సాధారణ ఎన్నికలు రాబోతున్నాయి. ప్రధాన రాజకీయ పక్షాలు పూర్తి స్థాయిలో సిద్ధం అవుతున్నాయి. ఈ నేపథ్యంలో టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్ర వ్యాప్తంగా 'రా కదలిరా' అంటూ ఎన్నికల సంగ్రామానికి శంఖారావం పూరించారు. ఇందులో భాగంగా ఆళ్లగడ్డ బహిరంగసభకు రానున్నారు. మంగళవారం నాడే చంద్రబాబు సతీమణి భువనేశ్వరి 'నిజం గెలవాలి' కార్యక్రమంలో భాగంగా జిల్లాకు రానున్నారు. చంద్రబాబు అక్రమ అరెస్టును తట్టుకోలేక మృతి చెందిన టీడీపీ కార్యకర్తల కుటుంబాలను ఆమె పరామర్శిస్తారు. చంద్రబాబు దంపతులు నేడు ఉమ్మడి కర్నూలు జిల్లాలో వేర్వేరు కార్యక్రమాల్లో భాగంగా పర్యటించనున్నారు. కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు, మంత్రాలయం నియోజకవర్గాల్లో భువనేశ్వరి 'నిజం గెలవాలి' కార్యక్రమంలో పాల్గొంటారు. 'రా కదలిరా' అంటూ కార్యకర్తలను, ఓటర్లను సన్నద్ధం చేసేందుకు నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ సభలో చంద్రబాబు ఎన్నికల శంఖారావం పూరించనున్నారు. చంద్రబాబు దంపతుల పర్యటనలను విజయవంతం చేయడానికి కర్నూలు, నంద్యాల జిల్లాల టీడీపీ అధ్యక్షులు ఎమ్మెల్సీ బీటీ నాయుడు, మాజీ జడ్పీ చైర్మన్ మల్లెల రాజశేఖర్ ఆధ్వర్యంలో ఆ పార్టీ నియోజకవర్గం ఇన్‌చార్జిలు కసరత్తు చేస్తున్నారు.

● రెండో రోజు భువనేశ్వరి పర్యటన

భువనేశ్వరి బుధవారం ఆదోని నుంచి ఉదయం 10 గంటలకు బయలుదేరి 11 గంటలకు నందవరం మండలం మాచాపురం చేరుకుంటారు. ఎమ్మిగనూరు టీడీపీ ఇన్‌చార్జి బీవీ జయనాగేశ్వరరెడ్డితో కలిసి.. బోయ కొండా హనుమంతు కుటుంబ సభ్యులను పరామర్శిస్తారు. 11.30 గంటలకు ముగతి గ్రామంలో నాగరాజు, 12.15 గంటలకు గోనెగండ్ల మండలం బి. అగ్రహారం గ్రామంలో సుధాకర్ నాయుడు, మధ్యాహ్నం 1.25 గంటలకు అల్వాల గ్రామంలో ఈరన్న కుటుంబాలను పరామర్శిస్తారు. భోజనం అనంతరం 2.25 గంటలకు గోనెగండ్ల మండలం ఎర్రబాడులో కౌలుట్లయ్య నాయుడు కుటంబాన్ని కలుసుకుంటారు. 4.30 గంటలకు ఓర్వకల్లు విమానాశ్రయం చేరుకొని హైదరాబాదుకు బయలుదేరతారు. ఈ గ్రామాల్లో భువనేశ్వరి చేపట్టిన నిజం గెలవాలి పర్యటన ఏర్పాట్లను మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జి పి.తిక్కారెడ్డి, ఎమ్మిగనూరు ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి చేస్తున్నారు.

● కోడుమూరు, పత్తికొండ పర్యటన వాయిదా:

షెడ్యూలు ప్రకారం నారా భువనేశ్వరి మంగళవారం కోడుమూరు నియోకవర్గం గూడూరు మండలం పెంచికలపాడు గ్రామంలో మహబూబ్‌బాషా, గూడూరులో షెక్షావలి, బోయ గౌరన్న, కోడుమూరు మండలం ప్యాలకుర్తిలో నాగార్జుగౌడ్ కుటుంబాలను, పత్తికొండ నియోజకవర్గం కృష్ణగిరి మండలం ఎర్రగుడిలో పింజరి సుభాన్, తుగ్గలి మండలం మిథెతాండలో రమావత్‌లక్ష్మి, కడమకుంట్ల గ్రాయంలో మృతి చెందిన టీడీపీ కార్యకర్త వడ్డే చిన్న రాముడు కుటుంబాలను భువనేశ్వరి పరామర్శించాల్సి ఉండేది. హెలికాప్టర్ సమస్య వల్ల ఈ నియోజకవర్గాల్లో ఆమె పర్యటన వాయిదా పడినట్లు బీటీ నాయుడు తెలిపారు. త్వరలోనే ఆ నియోజకవర్గాల్లో కూడా భువనేశ్వరి పర్యటించి మృతి చెందిన కుటుంబాలను పరామర్శించి ఆర్థిక సాయం అందజేస్తారని తెలిపారు.

● నేడు మంత్రాలయంలో నిజం గెలవాలి:

జిల్లాలో నారా భువనేశ్వరి 'నిజం గెలవాలి' కార్యక్రమం షెడ్యూలులో మార్పు జరిగినట్లు టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీటీ నాయుడు తెలిపారు. మంగళవారం ఉదయం 11.30 గంటలకు ఓర్వకల్లు విమానాశ్రయం చేరుకున్న భువనేశ్వరి రోడ్డు మార్గంలో నేరుగా మంత్రాలయం నియోజకవర్గం పర్యటనకు బయలుదేరుతారు. గతేడాది సెప్టెంబరు 9న చంద్రబాబు అక్రమ అరెస్టు సందర్భంలో తీవ్ర మనస్తాపానికి గురై మృతి చెందిన టీడీపీ కార్యకర్తల కుటుంబాలను మంత్రాలయం ఇన్‌చార్జి తిక్కారెడ్డితో కలసి ఆమె పరామర్శించి ఆర్థిక సాయం అందజేస్తారు. మధ్యాహ్నం 2.10 గంటలకు పెద్దకడుబూరు చేరుకొని మృతి చెందిన టీడీపీ కార్యకర్త గోపాల్ ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శిస్తారు. 3.55 గంటలకు కౌతాళం మండలం వల్లూరులో ఈరమ్మ, సాయంత్రం 5.15 గంటలకు మంత్రాలయంలోని రామచంద్రా నగర్‌లో తాయమ్మ కుటుంబాలను పరామర్శిస్తారు. సాయంత్రం 6.50 గంటలకు ఆదోని చేరుకొని రాత్రి మండిగిరిలోని చేకూరి పుల్లయ్య ఫంక్షన్ హాల్‌లో బస చేస్తారు. ఆదోని టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కె.మీనాక్షినాయుడు భువనేశ్వరిని కలుస్తారు.





- ఉమ్మడి జిల్లాకు చంద్రబాబు దంపతులు
- ఇటు 'రా కదలిరా', అటు 'నిజం గెలవాలి'
- ఆళ్లగడ్డ సభలో పాల్గొననున్న చంద్రబాబు
- బాధిత కుటుంబాలను పరామర్శించనున్న భువనేశ్వరి
- తెలుగు తమ్ముళ్లలో ఉరకలెత్తే ఉత్సాహం

● టీడీపీ శ్రేణుల్లో ఉత్సాహం:

జిల్లాలో రెండు రోజుల పర్యటనలో భాగంగా భువనేశ్వరి మంగళవారం ఉదయం 11.30 గంటలకు ఓర్వకల్లు విమానాశ్రయం చేరుకుంటారు. రా కదిరా సభలో పాల్గొనేందుకు చంద్రబాబునాయుడు మధ్యాహ్నం 2.10 గంటలకు ఆళ్లగడ్డకు చేరుకుంటారు. 2.30 గంటల నుంచి 3.45 గంటల వరకు సభలో పాల్గొంటారు. ఈ మేరకు ఏర్పాట్లు సాగుతున్నాయి.

నిజం గెలవాలి

జిల్లాలో నేడు, రేపు నారా భువనేశ్వరి పర్యటన

కర్నూలు(అర్బన్), జనవరి 8: నారా భువనేశ్వరి తలపెట్టిన 'నిజం గెలవాలి' జిల్లా పర్యటనను విజయవంతం చేయాలని ఎమ్మెల్సీ జిల్లా అధ్యక్షుడు బీటీ నాయుడు అన్నారు. సోమవారం జిల్లా టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ఏడాది సెప్టెంబర్ 9న చంద్ర బాబును అక్రమంగా అరెస్టు చేసి 53 రోజులు జైల్లో పెట్టడంతో ఎంతో మంది మనోవేదనకు గురై గుండె ఆగి మృతి చెందారని తెలిపారు. జిల్లాలో మృతి చెందినవారి కుటుంబాలను నారా భువనేశ్వరి నిజం గెలవాలి అనే పేరుతో చేపట్టిన కార్యక్రమంలో భాగంగా ఈనెల 9, 10 తేదీల్లో కర్నూలు జిల్లాకు రానున్నారని అన్నారు. 9న కోడుమూరు, పత్తికొండ, 10న మంత్రాలయం, ఎమ్మిగనూరు నియోజకవర్గాల్లో ఆమె పర్యటిస్తారని తెలిపారు.


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీటీ నాయుడు



దశాబ్ద కాలంగా ఉమ్మడి కర్నూలు జిల్లా ఎన్నడూ లేని దుర్భిక్షాన్ని ఎదుర్కొంటోందని జలవనరుల శాఖ అధికారులు, రైతులు ఆందోళన చెందుతున్నారు. శ్రీశైలం జలాశయం, తుంగభద్ర జలాశయం డెడ్ స్టోరేజీకి చేరుకుంటున్నాయి. ఫలితంగా నిన్న మొన్నటి దాకా కాస్తో.. కూస్తో నీటి ఛాయలతో కనిపించిన ప్రధాన కాలువలు కేసీ కెనాల్, ఎల్లెల్సీ, ఎస్సార్బీసీ, తెలుగు గంగ, గాజులదిన్నె తదితర కాలువలు ఎండిపోయి రైతులను ఆందోళనకు గురి చేస్తున్నాయి.

● ఎండిన కాలువలు, బీడువారిన పొలాలు ● దశాబ్ద కాలంలో ఎన్నడూ లేని దుస్థితి

కర్నూలు(అగ్రికల్చర్), జనవరి 8: ఉమ్మడి కర్నూలు జిల్లాలో ప్రధాన జలాశయాలతోపాటు చిన్న నీటి వనరుల ద్వారా దాదాపు 6 లక్షల ఎకరాల్లో సాగు చేసిన పంటలకు నీరందిస్తున్నారు. ఈసారి జూన్ నుంచి వర్షం జాడ లేకపోవడంతో వరద ప్రవాహం ఆగస్టుకే సన్నగిల్లింది. దీంతో నీటి నిల్వ కూడా అంతంతమాత్రంగా ఉండడంతో ఖరీఫ్ సీజన్‌లో కేసీ కెనాల్, ఎల్లెల్సీ, ఎస్సార్బీసీ, తెలుగు గంగ తదితర ప్రధాన కాలువల ద్వారా అతికష్టమ్మీద నీటి పారుదల శాఖ అధికారులు నీటిని విడుదల చేశారు. ప్రస్తుతం రబీలో ఆరుతడి పంటలకైనా నీరు ఇస్తారేమోనని రైతులు ఎదురు చూసినా తాగునీటి ఎద్దడిని ఎదుర్కోడానికే తీవ్ర ఇబ్బందులు తప్పేట్లు లేవని, ఈ పరిస్థితుల్లో రబీ పంటలకు ఎట్టి పరిస్థితుల్లోనూ నీరు ఇవ్వలేమని తేల్చి చెప్పడంతో రైతులు పంటల సాగును విరమించుకున్నారు. రబీలో దాదాపు ప్రధాన కాలువల కింద ఉమ్మడి కర్నూలు జిల్లాలో మూడు లక్షల ఎకరాలకు సాగు నీరు అందిస్తున్నారు. ఈసారి ఒక్క ఎకరాకు కూడా సాగు నీరు అందించలేకపోవడంతో పొలాలన్ని నెర్రలిచ్చి బీడువారిపోయాయి.

● తుంగభద్ర జలాశయంలో 105.788 నీటి నిల్వ సామర్థ్యం ఉండాలి. గత సంవత్సరం ఇదే సమయానికి 70 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ప్రస్తుతం 10.286 టీఎంసీల నీరు నిల్వ ఉందని, ఎగువ నుంచి చుక్కనీటి ప్రవాహం కూడా జలాశయంలోకి రావడం లేదని, ఈ పరిస్థితుల్లో వచ్చే జూన్ వరకు తాగునీటి అవసరాలను ఏవిధంగా తీర్చాలో అర్థం కాని పరిస్థితి నెలకొందని జలవనరుల శాఖ అధికారులు స్పష్టం చేస్తున్నారు. గత దశాబ్ద కాలంలో తుంగభద్ర జలాశయంలో ఈ పరిస్థితి నెలకొనడం ఇదే మొదటిసారి అని అంటున్నారు.

● ఏపీతోపాటు పక్క రాష్ట్రాలైన తెలంగాణ, కర్ణాటకతోపాటు మద్రాసు రాష్ట్రానికి కూడా నీరందించడానికి ఏకైక మార్గంగా ఉన్న శ్రీశైలం జలాశయంలో ప్రస్తుతం 49.83 టీఎంసీల నీరు మాత్రమే నిల్వ ఉంది. గత సంవత్సరం 80 టీఎంసీల దాకా ఇదే సమయానికి నిల్వ ఉందని అధికార వర్గాలు తెలిపాయి. ఈ జలాశయం నీటి నిల్వ సామర్థ్యం 215 టీఎంసీలు కాగా, గత సంవత్సరం దాదాపు ఏడు సార్లు పూర్తిగా నిండి దిగువకు వదిలారు. ఈసారి మొదటి నుంచి ఆ పరిస్థితి కనిపించలేదు. అదేవిధంగా కర్నూలు తాగునీటి అవసరాలు తీరుస్తున్న సుంకేసుల జలాశయంలో పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 1.2 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 0.881 టీఎంసీల నీరు మాత్రమే నిల్వ ఉంది. కర్నూలు తాగునీటి అవసరాల కోసం రోజూ 159 టీఎంసీల నీటిని విడుదల చేస్తున్నారు. గాజులదిన్నె జలాశయంలో 4.5 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యానికి గాను 1.845 టీఎంసీల నీరు మాత్రమే నిల్వ ఉంది. జూన్ వరకు ఎమ్మిగనూరు, కోడుమూరు, డోన్‌తో పాటు కర్నూలు తాగునీటి అవసరాలను ఈ కొద్దిపాటి నీటితో ఎలా సర్దుబాటు చేయాలో అర్థం గాక అధికారులు తలపట్టుకూర్చున్నారు. క్రిష్ణగిరి జలాశయంలో 0.164 టీఎంసీలకుగను 0.68 టీఎంసీల నీరు మాత్రమే నిల్వ ఉంది. జూన్ వరకు తాగునీటి అవసరాలను ఉమ్మడి కర్నూలు జిల్లా ప్రజలకు ఏవిధంగా జలాశయాల్లో అంతంత మాత్రంగా ఉన్న నీటి నిల్వ నుంచి సర్దుబాటు ఎలా చేయాలో అర్థం కావడం లేదని జలవనరుల శాఖ అధికారులు చెబుతున్నారు.

తాగునీటి అవసరాలకు ఇబ్బందులు ఉన్నాయి

గత సంవత్సరం వర్షాభావ పరిస్థితుల వల్ల ప్రధాన జలాశయాలతోపాటు మధ్యతరహా, చిన్ననీటి తరహా జలాశయాల్లో పూర్తి స్థాయిలో నీటి నిల్వ చేరలేదు. జూన్ వరకు జలాశయాల్లో ఉన్న కొద్ది పాటి నీటితోనే ప్రజల తాగునీటి అవసరాలను సర్దుబాటు చేయాల్సి ఉంది. నీటి వృథాను అరికట్టి తాగునీటిని అందించేందుకు చర్యలు తీసుకుంటాం.

- రెడ్డి శేఖర్ రెడ్డి, ఎస్ఈ

కరువు మండలంగా ప్రకటించాల్సిందే

● ఆర్డీవో కార్యాలయం ముట్టడించిన తుగ్గలి రైతులు


మాట్లాడుతున్న కేఈ శ్యాంబాబు

పత్తికొండ, జనవరి 8 : తుగ్గలి మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాల్సిందే.. అని రైతులు పత్తికొండ ఆర్డీవో కార్యాలయాన్ని ముట్టడించారు. సోమవారం టీడీపీ కార్యాలయం నుండి అఖిలపక్షాల ఆధ్వర్యంలో రైతులు ర్యాలీగా బయలుదేరి నాలుగు స్తంభాల కూడలిలో బైఠాయించి నిరసన తెలిపారు. అనంతరం ఆర్డీవో రామలక్ష్మితో మాట్లాడుతూ అధికారులకు తమ కష్టాలు పట్టవా? అని తుగ్గలి మండలం రైతులు నిలదీశారు. అంతక ముందు జరిగిన ఆందోళన కార్యక్రమంలో టీడీపీ ఇన్‌చార్జి కేఈ శ్యాంబాబు మాట్లాడుతూ తుగ్గలిని కరువు మండలంగా ప్రకటించే విషయంలో నివేదికలు పంపామని అధికారులు రెండు నెలలుగా చెబుతున్నారేగాని ఫలితం కనిపించడం లేదని అన్నారు. జిల్లాలో అన్ని మండలాలను కరువు పీడిత ప్రాంతాలుగా ప్రకటించిన ప్రభుత్వం తుగ్గలి, కర్నూలు రూరల్ మండలాలను జాబితాలో చేర్చలేదని అన్నారు. జడ్పీమాజీ చైర్మన్ బత్తిన వెంకటరాముడు, సీపీఐ జిల్లా నాయకులు గిడ్డయ్య, నబీరసూల్ మాట్లాడుతూ.. ముందస్తు వర్షాలకు పంటలు సాగుచేసిన తుగ్గలి మండల రైతులు ఆ తర్వాత వర్షాభావం వల్ల పంటలు ఎండిపోయి తీవ్రంగా నష్టపోయారని అన్నారు. అయితే శాటిలైట్ ద్వారా చేసిన సర్వేలో తుగ్గలి మండలంలో కరువు లేదని ప్రభుత్వం నిర్ధారణకు రావడం దారుణమని అన్నారు. తుగ్గలి మండలంలో కరువు పరిస్థితులపై రైతులు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోలేదన్నారు. తక్షణం ప్రభుత్వం స్పందించకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ఆర్డీవో కార్యాలయం ముట్టడితో ఉద్రిక్తత..

రహదారి బైఠాయింపు అనంతరం ఆర్డీవో కార్యాలయం ముట్టడికి అఖిలపక్షం నాయకులు బయలుదేరారు. దీంతో అప్రమత్తమైన పోలీసులు కార్యాలయంలోకి అఖిలపక్షం నాయకులు, రైతులను వెళ్లనివ్వకుండా అడ్డుకున్నారు. దీంతో పోలీసులకు, రైతులకు మధ్య తోపులాట జరిగింది. చివరకు ఆర్డీవో జోక్యం చేసుకోవడంతో కార్యాలయం ముందు బైఠాయించారు. తుగ్గలి మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలన్న నివేదికలు కలెక్టర్ పంపామని, జిల్లాకు వచ్చిన కరువు బృందానికి కలెక్టర్ నివేదికలు అందించారని ఆర్డీవో వారికి వివరణ ఇచ్చారు. అయితే కరువు మండలం ప్రకటించాల్సింది రాష్ట్ర ప్రభుత్వమని కరువుబృందానికి నివేదికలు ఇస్తే తమకు న్యాయం ఎలా జరుగుతుందని రైతులు ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు చందోలితిరుపాల్, తిరుపాల్‌నాయుడు, గుడిసె నరసింహులు, జనసేన ఇన్‌చార్జి రాజశేఖర్, సీపీఐ నాయకుడు మద్దిలేటి శెట్టి, సుల్తాన్, పెద్దఈరన్న పాల్గొన్నారు.

నేటి నుంచి కేంద్ర మంత్రి పర్యటన

కర్నూలు(ఎడ్యుకేషన్), జనవరి 8: కేంద్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యపాల్ సింగ్ బాగాల్ మంగళవారం నుంచి కర్నూలు జిల్లాల్లో పర్యటించనున్నారు. ఈ నెల 9వ తేదీన హైదరాబాద్ నుంచి ఆయన రోడ్డు మార్గంలో బయలుదేరి మధ్యాహ్నం 3గంటలకు కర్నూలు చేరుకుంటారు. అనంతరం సాయంత్రం 5గంటలకు కర్నూలు రూరల్ మండలం గార్గేయపురం గ్రామంలో పర్యటిస్తారు. ఆరుగంటలకు కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో పర్యటించి, 6.30గంటలకు పాత్రికేయుల సమావేశంలో పాల్గొంటారు. ఈ నెల 10న ఉదయం 10 నుంచి 12.30గంటల వరకు ఎమ్మిగనూరు నియోజక వర్గంలోని నందవరం మండలంలో, మధ్యాహ్నం 3గంటల నుంచి 5గంటల వరకు హొళగుంద మండలంలోని గంజిహళ్లి గ్రామంలో పర్యటిస్తారు. 11వ తేదీన ఉదయం 10.30 గంటల నుంచి 12గంటల వరకు తుగ్గలి మండలం పగడిరాయి గ్రామంలో పర్యటిస్తున్నట్లు మీడియా ప్రతినిధి సాయిప్రదీప్ తెలిపారు.

ఉమ్మడి జిల్లాకు పర్యవేక్షణ అధికారి నియామకం

ఉత్తర్వులు జారీ చేసిన మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్

కర్నూలు(న్యూసిటీ), జనవరి 8: కార్పొరేషన్, మున్సిపాలిటీ కార్మికులు సమ్మెలోకి వెళ్లిన నేపథ్యంలో కార్మికుల సమస్యలను పరిష్కారం, శానిటేషన్ పర్యవేక్షణ కోసం రాష్ట్ర మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ పి. కోటేశ్వరరావును ఉమ్మడి జిల్లా పర్యవేక్షణ అధికారిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసారు. అనంతపురం రీజినల్ డైరెక్టర్ పీవీవీఎస్. మూర్తిని నియమించారు. ఈ మేరకు ఉమ్మడి జిల్లాలోని కర్నూలు కార్పొరేషన్‌తో పాటు ఆదోని, నంద్యాల, ఎమ్మిగనూరు, డోన్, నందికొట్కూరు, ఆత్మకూరు, గూడూరు, ఆళ్లగడ్డ, బేతంచెర్ల మున్సిపాలిటీలలో సమ్మె చేస్తున్న యూనియన్ నాయకులతో చర్చలు జరపాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. పర్యవేక్షణ అధికారికి కమిషనర్లు సహకరించాలని ఉత్తర్వుల్లో ఉంది. ప్రతిరోజు మధ్యాహ్నం 12 గంటలలోపు సంబంధిత వివరాలను పర్యవేక్షణ అధికారి తెలియజేయాలి.

జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేయాలి

● తెలుగు యువత ఆధ్వర్యంలో నిరసన



కలెక్టర్‌కు వినతి పత్రం ఇస్తున్న తెలుగు యువత నాయకులు

కర్నూలు(అర్బన్), జనవరి 8: రాష్ట్ర ప్రభుత్వం వెంటనే జాబ్ క్యాలెండర్ విడుదల చేసి వెంటనే ఉద్యోగాలు భర్తీ చేయాలని తెలుగు యువత అధ్యక్షుడు ఎస్ అబ్బాస్ డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కార్యాలయం సమీపంలోని మోక్షగుండం విశ్వేశ్వరయ్య సర్కిల్‌లో ర్యాలీ, అనంతరం కలెక్టర్ డా. జీ. సృజనకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రతి సంవత్సరం జనవరి నెలలో జాబ్ క్యాలెండర్ విడుదల చేసి 2.30 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తానని హామీ ఇచ్చి విస్మరించారని అన్నారు. 2019లో ఉన్న నిరుద్యోగ సమస్య 2023 నాటికి 6.6 శాతం పెరిగిందని అన్నారు. 75 శాతం పైగా పట్టభద్రులు మన రాష్ట్రంలో ఉన్నారని, ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లేక రాష్ట్రంలో 21,575 మంది యువత ఆత్మహత్యకు పాల్పడిందని అన్నారు.ఈ నాలుగున్నరేళ్ల కాలంలో ఎంత మంది నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇచ్చిందీ ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి వెల్లడించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సోమిశెట్టి నవీన్, గోపినాథ్, కే. వంశీధరరెడ్డి పాల్గొన్నారు.

మంత్రాలయం మఠానికి రూ.9 లక్షలు విరాళం

మంత్రాలయం, జనవరి 8: మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠానికి హైదరాబాద్‌కు చెందిన ఎన్‌సీ సుగుణ అనే భక్తురాలు రూ.9 లక్షలు అన్నదానానికి విరాళంగా ఇచ్చినట్లు మఠం మేనేజరు ఎస్కే శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం కుటుంబ సమేతంగా రాఘవేంద్ర స్వామిని దర్శించుకుని విరాళం ఇచ్చినట్లు తెలిపారు. విరాళం ఇచ్చిన దాత కుటుంబ సభ్యులకు మఠం పండితులు రాఘవేంద్ర స్వామి మెమెంటో, పరిమళ ప్రసాదం ఇచ్చి ఆశీర్వదించారు.

వైభవంగా ద్వాదశి వేడుకలు

స్వర్ణ రథంపై ప్రహ్లాదరాయలు



స్వర్ణ రథంపై ఊరేగుతున్న ప్రహ్లాదరాయులు

మంత్రాలయం, జనవరి 8: మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠంలో ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలు స్వర్ణరథంపై భక్తులకు దర్శనం ఇచ్చారు. సోమవారం ద్వాదశి వేడుకలను పురస్కరించుకుని మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల ఆధ్వర్యంలో తెల్లవారుజాము నుంచే రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రహ్లాదరాయలను ఆలయ ప్రాంగణం చుట్టూ ఊరేగించారు.

డిగ్రీలో ఏడుగురి డీబార్

కర్నూలు(అర్బన్), జనవరి 8: డిగ్రీ 1, 5 సెమిస్టర్ పరీక్షల్లో ఏడుగురు విద్యార్థులు డీబార్ అయ్యారని పరీక్షల విభాగం కంట్రోలర్ డా. ఎన్ వెంకటేశ్వర్లు తెలిపారు. సోమవారం రాయలసీమ యూనివర్సిటీ పరిధిలోని 16 పరీక్షా కేంద్రాల్లో 1వ సెమిస్టర్‌కు 11,145 మందికిగాను 10,025 మంది, 5వ సెమిస్టర్ 2,362 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 2,122 మంది హాజరయ్యారని తెలిపారు.

జిల్లా కోర్టులో తెలుగులో తీర్పు

కర్నూలు(లీగల్), జనవరి 7: ఆర్టీసీ బస్సు ఢీకొని మృతి చెందిన ఇద్దరు వ్యక్తుల కుటుంబాలకు సంబంధించి నష్ట పరిహారం చెల్లించాల్సిందిగా ఏపీఎస్‌ఆర్టీసీని ఆదేశిస్తూ కర్నూలు 7వ అదనపు జిల్లా జడ్జీ జీ. భూపాల్ రెడ్డి సోమవారం తెలుగులో తన తీర్పును వెలువరించారు. మంత్రాలయం మండలం మాలపల్లి గ్రామానికి చెందిన రైతు అంజనేయులు తన మిరప పంటను విక్రయించడానికి బొలెరో వాహనంలో గుంటూరుకు వెళ్లాడు, అక్కడ పంటను అమ్మి ఆదే వాహనంలో 2022 ఫిబ్రవరి 11న నందికొట్కూరు సమీపంలో వస్తుండగా ఎదురుగా వస్తున్న ఏపీఎస్‌ఆర్టీసీ బస్సు బొలెరో వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో రైతు అంజనేయులు బొలెరో వాహనం డ్రైవర్ స్వామిరెడ్డి మృతి చెందాడు. మృతుల వారసులు నష్టపరిహారం కోసం కోర్టును ఆశ్రయించారు. కేసు విచారించిన పిదప 7వ అదనపు జిల్లా జడ్జి జీ. భూపాల్ రెడ్డి మృతుల కుటుంబాలకు రూ. 42,14, 500 నష్టపరిహారం చెల్లించాలని ఏపీఎస్‌ఆర్టీసీని ఆదేశిస్తూ తీర్పు తెలుగులో వెల్లడించారు.

కొనసాగుతున్న సమ్మె

● పేరుకపోతున్న చెత్త

● రోడ్లపైకి వచ్చిన క్లాప్ వాహనాలు



పేరుకుపోతున్న చెత్త

ఆదోని టౌన్, జనవరి 8 : గత వారం రోజులుగా మునిసిపాలిటీలోని పారిశుద్ధ విభాగానికి చెందిన కాంట్రాక్టు కార్మికులు 78 మంది సమ్మెలో పాల్గొంటున్న కారణంగా పట్టణంలో చెత్త తరలింపునకు తీవ్ర ఆటంకం ఏర్పడింది. దీనికి తోడు క్లాప్ వాహనాల డ్రైవర్లకు ఏజెన్సీ నుండి జీతాలు అందకపోవడంతో వాహనాలు మున్సిపల్ కార్యాలయానికే పరిమితమయ్యాయి. ఫలితంగా చెత్త తరలింపుకు తీవ్ర ఆటంకాలు ఏర్పడ్డాయి. ఉన్న 109 మంది పర్మినెంట్ కార్మికులతో పూర్తి స్థాయిలో చెత్త తరలింపు కష్టతరంగా మారింది. సమస్య పెరగక ముందే అధికారులు అప్రమత్తమై, క్లాప్ వాహనాల డ్రైవర్లకు నాలుగు నెలల జీతాలను ఏజెన్సీ ద్వారా ఇప్పించి సోమవారం నుండి చెత్త తరలింపు వాహనాలను రోడ్ల పైకి తీసుకొచ్చారు. అయినా పారిశుద్ధ పనులు పూర్తిస్థాయిలో జరిగాక అనేక ప్రాంతాల్లో చెత్త పేరుకొని దుర్వాసన వేస్తోందన్న విమర్శలు వస్తున్నాయి. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించకుంటే సమ్మెను ఉధృతం చేస్తామని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు అజయ్ బాబు హెచ్చరిస్తున్నారు. ఎన్నికలకు ముందు కాంట్రాక్టు కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేసే వరకు సమ్మె కొనసాగుతుందని అంటున్నారు.

స్పందన అర్జీలను పరిష్కరించండి

సబ్ కలెక్టర్ శివ నారాయణ శర్మ



ఫిర్యాదులు స్వీకరిస్తున్న సబ్ కలెక్టర్ శివనారాయణ శర్మ

ఆదోని, జనవరి 8 : స్పందన కార్యక్రమంలో వచ్చిన అర్జీలను నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించి అర్జీదారులను సంతృప్తి పరచాలని సబ్ కలెక్టర్ శివ నారాయణ శర్మ సూచించారు. సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో స్పందన కార్యక్రమంలో వచ్చిన అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని ఆయా శాఖల అధికారులకు సంబంధించిన సమస్యలను తెలియజేస్తూ గడువులోపు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ ఎస్సీ హాస్టల్‌లో మౌలిక సదుపాయాలు లేవని సబ్ కలెక్టర్ దృష్టికి తీసుకొని రాగా వెంటనే స్పందించి .. అక్కడ సమస్యలు పరిష్కరించమని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు.

మండలాల నుంచి వచ్చిన సమస్యలు కొన్ని...

బలాదూర్ గ్రామంలో సర్వే నంబర్ 1762బీలో 2.00 ఎకరాల భూమి గత 30 సవత్సరాలుగా సాగు చేసుకుంటున్నామని, దానికి పట్టాదారు పాసుపుస్తకం మంజూరు చేయాలని ఆదోని మండలం సంతేకుడ్లూరు గ్రామానికి చెందిన రాహేలమ్మ అర్జీ సమర్పించుకున్నారు.

సర్వే నెంబర్ 636/ఏ2లో తమకు ఉన్న 1.80 ఎకరాల భూమిలో కొంత కొందరు ఆక్రమించుకున్నారని, సర్వే చేసి భూమి హద్దులు చూపాలని పెద్దకడబూరు గ్రామానికి చెందిన సన్నపు ఉలింద్ర అర్జీ సమర్పించుకున్నారు.

సర్వే నెంబర్ 1-07బీలో తమకు ఉన్న 0.95 సెంట్ల భూమిని ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని మంత్రాలయం మండలం మాధవరం గ్రామానికి చెందిన చిన్న ఈరన్న అర్జీ సమర్పించుకున్నారు.

సర్వే నెంబర్ 117లో 0.83 సెంట్లు, 98/ఏలో 2.10 ఏకరాలు, 177/సీలో 0.83 సెంట్ల భూమి ఆన్-లైన్‌లో వేరే వారి పేరుతో నమోదై ఉందని, సమస్య పరిష్కరించాలని హొళగుంద మండలం సులువాయి గ్రామానికి చెందిన పంపాపతి అర్జీ సమర్పించారు. ఈ కార్యక్రమంలో పరిపాలన అధికారి గోవింద్ సింగ్, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ వేణు సూర్య, డీఎల్‌డీవో నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు విధులు నిర్వర్తించాలి

ఎన్నికల్లో సెక్టార్ ఆఫీసర్లు, సెక్టార్ పోలీస్ ఆఫీసర్ల పాత్ర కీలకమైనదని, ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం వారు విధులను నిర్వర్తించాలని ఆదోని ఎన్నికల అధికారి, సబ్ కలెక్టర్ శివనారాయణ శర్మ పేర్కొన్నారు. సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో సెక్టార్ ఆఫీసర్లు, సెక్టార్ పోలీస్ ఆఫీసర్లకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ శివనారాయణ శర్మ అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెక్టార్ పోలీస్ ఆఫీసర్లు పోలింగ్ స్టేషన్‌లో నిర్దేశించిన కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయాలన్నారు. వల్నరబిల్టీ మాపింగ్ చేయాల్సి ఉంటుందన్నారు. ప్రతి సెక్టార్ అధికారి పరిధిలో 13 నుండి 14 పోలింగ్ స్టేషన్లు ఉండవచ్చని, వీటిలో కనీస సౌకర్యాలు ఉన్నాయా..? లేదా..? సెక్టార్ అధికారి, సెక్టార్ పోలీసు ఆఫీసర్ కలిసి పరిశీలించాలని ఆదేశించారు. పోలింగ్ స్టేషన్‌లను చూడకుండా సంతకాలు పెట్టకూడదని తెలిపారు. దీంతో పాటు ఆ పోలింగ్ స్టేషన్ పరిధిలో ఓటింగ్ శాతం, గతంలో ఉన్న అనుభవాలు తదితర పరిస్థితుల గురించి వల్నరబిలిటి మ్యాపింగ్ చేయాలని ఆదేశించారు. ఈ నెల 12వ తేదీ లోపల పోలింగ్ స్టేషన్‌లను విజిట్ చేయాలన్నారు. అదేవిధంగా ఏ పోలింగ్ స్టేషన్ ఎక్కడ ఉంది. దానికి సంబంధించిన దారి ఎటు, డిస్ట్రిబ్యూషన్ సెంటర్ తదితర వివరాలన్నీ మ్యాపింగ్ చేసుకోవాలన్నారు. సెక్టార్ ఆఫీసర్ పరిధిలోని పోలింగ్ కేంద్రాల పరిధిలో ఏ నెట్‌వర్క్ పనిచేస్తుందో తెలుసుకొని ఆ సిమ్ కార్డులను సెక్టర్ ఆఫీసర్లు, సెక్టార్ పోలిస్ ఆఫీసర్లు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. వృద్ధులు, పీడబ్ల్యూడీ ఓటర్లు, వైకల్యం శాతాన్నిబట్టి దరఖాస్తు చేసుకున్న వారికి ఓటు హక్కు వారికి కల్పించాల్సి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆదోని డీఎస్పీ శివ నారాయణ స్వామి మాట్లాడుతూ.. ఎన్నికల్లో సెక్టార్ ఆఫీసర్లు, సెక్టార్ పోలీసు ఆఫీసర్ల పాత్ర చాలా కీలకంగా ఉంటుందన్నారు. సెక్టార్ ఆఫీసర్లు ఇచ్చే సమాచారం ఆధారంగా నిర్ణయం తీసుకుంటారని అన్నారు. కాబట్టి, విధులను బాధ్యతాయుతంగా నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటలక్ష్మి, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

22న ఓటర్ల తుది జాబితా ప్రచురణ

ఓటర్ల తుది జాబితా జనవరి 22న ప్రచురిస్తామని ఆదోని ఎన్నికల అధికారి, సబ్ కలెక్టర్ శివనారాయణ శర్మ పేర్కొన్నారు. సోమవారం స్పెషల్ సమ్మరి రివిజన్ -2024లో భాగంగా వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సబ్ కలెక్టర్ హాలులో ఆయన మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు క్లయిమ్స్, డిస్పోజల్స్ జనవరి 12వ తారీఖు పూర్తి చేసి, 22వ తారీఖున తుది జాబితాను ప్రచురిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఆర్వో తహసీల్దార్ వెంకటలక్ష్మి, వైసీపీ తరఫున ప్రసాద్ రావు, టీడీపీ తరఫున సజ్జాద్, కాంగ్రెస్ పార్టీ తరఫున దేవిశెట్టి ప్రకాష్, బీజేపీ నుంచి నాగరాజ్ గౌడ్, జనసేన నుంచి తాహెర్, బీఎస్పీ నుంచి శాంతరాజు, సీపీఐ తరఫున లక్ష్మణ పాల్గొన్నారు.

విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేయాలి

ఎన్నికల హామీ నెరవేర్చాలని కార్మికుల దీక్షలు



మాట్లాడుతున్న ఎండీ అంజిబాబు

కల్లూరు, జనవరి 8: ఏపి ఎస్‌పీడీసీఎల్‌లో విధులు నిర్వహిస్తున్న విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేయాలని యునైటెడ్ ఎలిక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు పి.నాగరాజు, సిఐటీయు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి అంజిబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం విద్యుత్‌భవన్ ముందు రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా దీక్ష చేపట్టారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 10117 మంది కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేస్తామని ఉత్తర్వులు ఇచ్చిందని విద్యుత్‌సంస్థలో ఏళ్ళతరబడి పనిచేస్తున్న ఉద్యోగులను పరిగణలోకి తీసుకోకపోవడం అన్యాయం అన్నారు. సీఎం ఇచ్చిన హామీ ప్రకారం 2022 పిఆర్సీ ప్రకారం కనీస వేతనం చెల్లించాలన్నారు. మీటర్‌రీడర్స్‌కు ఉద్యోగ భద్రత కల్పించి కనీస వేతనం ఇవ్వాలని, బిల్‌కలెక్టర్, ఎస్పీఎం కార్మికులకు కనీస వేతనం అందించాలన్నారు. ఎన్నికల వాగ్దాలన్నీ ప్రభుత్వం నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కె.భీమేష్, ప్రవీణ్, జావిద్మీయా, మల్లికార్జునరెడ్డి, నాగరాజు. రాముడు తదితరులు పాల్గొన్నారు.

సాంప్రదాయక ఎరువుల వాడకం తగ్గించాలి

సహకార సొసైటీ సీఈవో ఖాజా మొహిద్దీన్‌తో మాట్లాడిన ప్రధాని మోదీ



స్టాల్స్‌ను పరిశీలిస్తున్న కర్ణాటక ఎంపీ వీరన్న కడాడి

పగిడ్యాల, జనవరి 8: సాంప్రదాయక ఎరువుల వాడకం తగ్గించాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సూచించారని సహకార సొసైటీ సీఈవో ఖాజా మెహిద్దీన్ తెలిపారు. వికసింత భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమంలో భాగంగా పగిడ్యాల ఆదర్శ పాఠశాల ఆవరణలో పీఎం లైవ్ టెలికాస్ట్ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. కర్ణాటక రాజ్యసభ సభ్యుడు వీరన్న కడాడి, కలెక్టరు మనిజిర్ జిలాని సామున్, జేసీ రాహుల్ కుమార్ రెడ్డి, జడ్పీ చైర్మన్ పాపిరెడ్డి, జిల్లా సహకార బ్యాంక్ చైర్మన్ విజయమనోహరి, బీజేపీ జిల్లా అధ్యక్షురాలు బైరెడ్డి శబరి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కర్ణాటక రాజ్యసభ సభ్యుడు వీరన్న కడాడికి జేసీ రాహుల కుమారు రెడ్డి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. సభ ఆవరణలో ఏర్పాటు చేసిన కేంద్ర ప్రభుత్వ పథకాలకు సంబంధించిన స్టాల్స్‌ను ఆయన పరిశీలించారు. సభావేదికపై వికసిత్ భారత్ ప్రతిజ్ఞ, ప్రధానమంత్రి సందేశాన్ని వినిపించారు. అనంతరం మధ్యాహ్నం 12.45 గంటలకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పగిడ్యాల సహకార సొసైటీ సీఈవో ఖాజా మోహిద్దీన్‌తో ప్రసంగించారు. ప్రధాన మంత్రికి కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పథకాలతో ఏ విధంగా లబ్ధి పొందిందీ వివరించారు. ఏఐఎఫ్, డీసీసీబీ ద్వారా మండలంతో రూ.3 కోట్ల రుణం మంజూరైనదని, దీంతో తమ పరిధిలో రైతుల కోసం ఐదు గోదాములు నిర్మించామని తెలిపారు. ప్రధాన మంత్రి నానో యూరియా వాడకం గురించి ఖాజాను ప్రశ్నించారు. దీంతో మూడేళ్లుగా నానో యూరియా వాడకంపై రైతులకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. నానో యూరియాతోపాటు సాంప్రదాయ ఎరువులు వాడటం వల్ల నేల ఆరోగ్యం దెబ్బతింటుందని, ఇలాగే జరిగితే భూములు పంటల సాగుకు పనికి రావని, దీంతో దేశం ఆర్థిక పరిస్థితి దెబ్బతింటుదని తెలిపారు. సాంప్రదాయ ఎరువుల వాడకాన్ని తగ్గించేందుకు కృషి చేయాలని తెలిపినట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామీణ అభివృద్ధి శాఖ డిప్యూటీ సెక్రటరీ లలిత్ కుమార్, డీపీవో మంజులావాణి, ఆర్‌డీవో దాసు, జడ్పీటీసీ పుల్యాల దివ్య, ఎంపీపీ మల్లీశ్వరి, సర్పంచ్ శేషన్న వికసిత్ భారత్ జిల్లా అధికార ప్రతినిధి ఆదినారాయణ రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నాగరాజు, పాల్గొన్నారు.

13 నుంచి లోకాయుక్తకు సెలవులు

కర్నూలు(లీగల్), జనవరి 7: ఈనెల 13 నుంచి 21 వరకు లోకాయుక్తకు సంక్రాంతి సెలవులు ప్రకటించారు. తిరిగి 22 నుంచి యదావిధిగా పని చేస్తుందని, బాధితులు ఈ విషయాన్ని తమనించాలని ఒక ప్రకటనలో పేర్కొంది.

26 న హైవే దిగ్బంధం

కర్నూలు (కలెక్టరేట్), జనవరి 8: విభిన్న ప్రతిభావంతుల సమస్యలను పరిష్కరించాలని విభిన్న ప్రతిభావంతుల జాయింట్ యాక్షన్ కమిటీ సభ్యులు ఎల్లప్ప, నాగరాజు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. 26న హైవే దిగ్బంధం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలియజేశారు.

మురుగులోనే తాగు నీరు

● కుళాయికి పైపు ఏర్పాటు చేయని అధికారులు

● కలుషిత నీరు తాగి అనారోగ్యం పాలవుతున్న ఎస్సీ కాలనీవాసులు



మురుగు మధ్యనే నీరు పట్టుకుంటున్న వృద్ధురాలు

హొళగుంద, జనవరి 8 : స్థానిక ఎస్సీ కాలనీలోని పదవ వార్డులో పంచాయతీ అధికారులు ఏర్పాటు చేసిన కుళాయి పైపు మరమ్మతులకు గురవడంతో కుళాయి చుట్టూ మురుగు నిలిచిపోయి దుర్గంధం వస్తున్నా, గంటల తరబడి తాగునీరు పట్టుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని కాలనీవాసులు వాపోతున్నారు. ఈ కలుషితనీరు తాగి అనారోగ్యం బారిన పడుతున్నట్లు వాపోయారు. నూతన పైపు ఏర్పాటు చేయాలని అధికారులకు కోరినా, పట్టించుకోవడం లేదన్నారు. ఈ విషయం పై పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్‌ను వివరణ కోరగా, రెండు రోజుల్లో పైపు ఏర్పాటు చేస్తామని తెలిపారు.

విధ్వంసం, అరాచకాలతో నాశనం చేశారు

బీటీ నాయుడు



కర్నూలు(అర్బన్), జనవరి 8: ఒక్క చాన్స్ అంటూ అధికారంలోకి వచ్చిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశ్వసనీయత, మడమ తిప్పం అంటూనే విధ్వంసం, అరాచకాలతో రాష్ట్రాన్ని నాశనం చేశారని ఎమ్మెల్సీ, జిల్లా అధ్యక్షుడు బీటీ నాయుడు అన్నారు. సోమవారం జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వ్యవసాయ శాఖను మూసేశారని, ఉద్యాన పంటల రైతులు రోడ్డున పడ్డారని, ధాన్యం రైతుఉ దగా పడ్డారని అన్నారు. ఒకప్పటి పచ్చని రాష్ట్రంలో నేడు రోజుకు ముగ్గురు రైతులు ఆత్మహత్య చేసుకుంటున్నారన్నారు. ఒక్క డిఎస్సీకి కూడా లేయువత నిరుద్యోగంతో అల్లాడి పోతున్నారన్నారు. ప్రస్తుతం వైసీపీ ఎమ్మెల్యేలే జగన్ రెడ్డిని నమ్మడం లేదన్నారు. జగన్ పని అయిపోయిందని, 95 శాతం ప్రజల మద్దతు కోల్పోయారని అన్నారు.

నేటి చంద్రబాబు సభకు జన సైనికులు హాజరు కావాలి

ఉమ్మడి జిల్లా జనసేన పార్టీ కోఆర్డినేటర్ సురేష్‌బాబు

కర్నూలు(కల్చరల్), జనవరి 8: టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు ఆళ్లగడ్డలో హాజరవుతున్న 'రా ...కదలిరా' సభకు జన సైనికులందరూ హాజరై విజయవంతం చేయాలని ఆ పార్టీ ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ చింతా సురేష్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ఉమ్మడి జిల్లాలో జనసేన నాయకులకు ఆహ్వానం లేదని కొంతమంది పనికట్టుకొని వదంతులు సృష్టిస్తూ, సోషల్ మీడియాలో ప్రచారం చేయడాన్ని ఆయన ఖండించారు. తెలుగుదేశం పార్టీ చేపట్టే ప్రతి సభకూ జనసేన పార్టీ తరఫున పూర్తి మద్దతు ఉంటుందని, నంద్యాల పార్లమెంటు పరిధిలో ఉన్న జన సైనికులు ఈ సభకు హాజరై విజయవంతం చేయాలని సురేష్‌బాబు కోరారు.

డాక్టర్ వి.పోతన్నకు తెలుగు భాషా పురస్కారం

కర్నూలు(కల్చరల్), జనవరి 8: కర్నూలుకు చెందిన ప్రముఖ కవి, జానపద గీత రచయిత, గాయకుడు డాక్టర్ వి. పోతన్నకు రాష్ట్ర అధికార భాషా సంఘం 'తెలుగు భాషా సేవా పురస్కారం' అందజేస్తోంది. మంగళవారం ఉదయం 10 గంటలకు అనంతపురంలోని జేఎన్‌టీయూ ఆడిటోరియంలో జరిగే 'అనంత తెలుగు భాషా వైభవ సదస్సులో ఈ పురస్కారాన్ని ఆయనకు అందజేస్తున్నట్లు రాష్ట్ర అధికార భాషా సంఘం అధ్యక్షుడు పి. విజయబాబు తెలిపారు. డాక్టర్ వి. పోతన్న ఆకాశవాణి వ్యాఖ్యాతగా అనంతపురం, కర్నూలు ఆకాశవాణి కేంద్రాల్లో 26 ఏళ్ల పనిచేసి 2017లో పదవీవిరమణ చేశారు. తెలుగు భాషపై ఆసక్తి ఉన్న ఆయన అనేక రచనలు చేశారు. జానపద కళలపై మక్కువతో అంతరించిపోతున్న జానపద పాటలను ఎంతో శ్రమించి సేకరించి, 300లకు పైగా జానపద గీతాలు, లలిత గీతాలను రికార్డుల రూపంలో తీసుకువచ్చారు. వివిధ పత్రికల్లో ఆయన రాసిన వ్యాసాలు, కథలు, కవితలు ప్రచురితం అయ్యాయి. అనేక సంస్థల నుంచీ సత్కారాలు అందుకున్న డాక్టర్ వి. పోతన్న తెలుగు భాషా పురోభివృద్ధికి చేస్తున్న కృషిని గుర్తించి అధికార భాషా సంఘం ఈ పురస్కారాన్ని ప్రకటించి, అందజేస్తోంది.

పీఠాధిపతిని ఊరేగించిన పూర్వ విద్యార్థులు



పీఠాధిపతికి పుష్పాభిషేకం చేస్తున్న వేద విద్యార్థులు

మంత్రాలయం, జనవరి 8: మంత్రాలయం శ్రీరాఘవేంద్ర స్వామి మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులను సోమవారం రాత్రి గురుసార్వభౌమ సంస్కృతపాఠశాల పూర్వ విద్యార్థులు వైభవంగా ఊరేగించారు. గురు వందనంలో భాగంగా సంస్కృత పాఠశాల నుంచి శ్రీమఠం వరకు భారీ ఊరేగింపు నిర్వహించారు. ఊంజల మంటపంలో పీఠాధిపతికి పుష్పాభిషేకంచేసి ఘనంగా సత్కారించారు. ఈ కార్యక్రమంలో మేనేజరు ఎస్కే శ్రీనివాసరావు, శ్రీపతి ఆచార్, ఐపీ నరసింహమూర్తి, రమణారావు, వాదిరాజాచార్, పండితులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

దామోదర్ మరణం పార్టీకి తీరని లోటు

కర్నూలు(అర్బన్), జనవరి 8: జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యదర్శి డి. దామోదరం మరణం పార్టీకి తీరని లోటని జిల్లా కమిటీ అధ్యక్షుడు కే. బాబు రావు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ దామోదర్ కాంగ్రెస్ పార్టీకి ఎన్నో సేవలు చేశారని, అనారోగ్య కారణాల వల్ల మరణించాడన్నారు. ఆయన కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతిని సంతాపాన్ని తెలియజేశారు.

ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి


సమావేశంలో మాట్లాడుతున్న గట్టు తిమ్మప్ప

కర్నూలు(ఎడ్యుకేషన్), జనవరి 8: పెండింగ్‌లో ఉన్న ఉద్యోగ,ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని డీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గట్టు. తిమ్మప్ప డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక డీటీఎఫ్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి పాదయాత్రలో ఉద్యోగులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఉపాధ్యాయ క్రాంతి పత్రిక సంపాదకుడు రత్నం ఏసేపు, నాయకులు మజ్‌హర్ బాషా, నగర అధ్యక్షులు గోపాల్, బీసన్న, బీమన్న, ముద్దు రంగప్ప, తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహన్ని పునఃప్రతిష్ఠించాలి


యుద్ధభేరి పోస్టర్లను విడుదల చేస్తున్న సమితి నాయకులు

కర్నూలు(న్యూసిటీ), జనవరి 8: నగర పరిధిలోని జొహరాపురంలో గతంలో తొలగించిన డా.బీఆర్.అంబేడ్కర్ విగ్రహన్ని పునఃప్రతిష్ఠించాలని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు కిరణ్‌మాదిగ డిమాండ్ చేశారు. 31న విజయవాడలో జరిగే యుద్ధభేరి మహాసభ పోస్టరును సోమవారం సెంట్రల్‌ప్లాజాలోని కార్యాలయంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దాదిపోగు నవీన్‌మాదిగ, జిల్లా అధికారి ప్రతినిధి జయన్న, మంత్రాలయం అధ్యక్షుడు నేపాల్‌మాదిగ, యువజన విభాగం నాయకులు వినోద్ తదితరులు పాల్గొన్నారు.

పాస్టర్ల అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక


పాస్టర్ల అసోసియేషన్ నూతన కార్యవర్గం

కర్నూలు(న్యూసిటీ), జనవరి 8: పాస్టర్ల అసోసియేషన్ కర్నూలు జిల్లా, నగర నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సోమవారం బుధవార పేట గుడ్‌షప్పర్డ్ చర్చిలో జరిగిన సర్వసభ్య సమావేశంలో నూతన కార్యవర్గాలను ఎన్నిక జరిగింది. జిల్లా కమిటీ చీఫ్ ఫంక్షనరీ అడ్వైజర్‌గా రెవ. డా.ఆర్‌ఆర్‌డి. సజీవరాజు, చీఫ్ ప్యాట్రన్ రెవ.డా.ఆర్.జార్జిరాజు, ప్రెసిడెంట్ యం.జాన్ సెరెల్లో, వైస్ ప్రెసిడెంట్ యం రాజేంద్రబాబు, సెక్రటరీ డా.యం. బాలరాజు, సంయుక్త కార్యదర్శి పి.విలియమ్స్, ట్రెజరర్ తియోడర్ జాకబ్, నగర చీఫ్ ఫంక్షనరీ అడ్వైజర్ రెవ డా.ఆర్‌ఆర్‌డి.సజీవరాజు, చీఫ్ ప్యాట్రన్ డా.ఆర్.జార్జిరాజు, ప్రెసిడెంట్ వి.షాలేమురాజు, వైస్ ప్రెసిడెంట్ జి.కిషోర్, సెక్రటరీ ఆర్.దాసు, సంయుక్త కార్యదర్శి పి.ఆమ్రోజ్, ట్రెజరర్ వి.ఎస్.రవికుమార్‌లను ఎకగ్రీవంగా ఎన్నుకున్నారు.

23వ రోజు క్లాప్ ఆటో డ్రైవర్ల సమ్మె

కర్నూలు(న్యూసిటీ), జనవరి 8: నగర పాలక సంస్థ పరిధిలో పని చేస్తున్న క్లాప్ ఆటో డ్రైవర్లు పెండింగ్ జీతాలు చెల్లించాలని చేపట్టిన సమ్మె సోమవారం 23వ రోజుకి చేరింది. పాతబస్తీ కార్యదర్శి ఎం.రాజశేఖర్ మాట్లాడుతూ కార్మికుల సమస్యలను పరిష్కరించకుంటే పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. వైసీపీ ప్రభుత్వం, అధికారులు, రెడ్డి ఏజెన్సీ కార్మికుల కడుపులు కొడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అబ్దుల్‌దేశాయ్, నరిసింహులు, కుమార్, ఇస్మాయిల్ తదితరులుపాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో భర్త మృతి.. భార్యకు గాయాలు

ఆళ్లగడ్డ, జనవరి 8: ఆళ్లగడ్డ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని పిచింతకుంట సమీపంలో భార్యాభర్తలను కారు ఢీకొన్న ఘటనలో భర్త రామాంజనేయులు(40) మృతి చెందగా భార్య సమాదానమ్మకు గాయపడ్డారు. సోమవారం మోటార్ సైకిల్‌పై ఆళ్లగడ్డ నుంచి కూరగాయలను తీసుకొని వెళ్తుండగా పి.చింతకుంట సమీపంలో గోదాము వద్ద కూరగాయల సంచి కింద పడిపోయింది. వాటిని సేకరించుకుంటున్న భార్యభర్తలను కోవెలకుంట్ల నుంచి ఆళ్లగడ్డకు వస్తున్న కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో భార్యభర్తలిద్దరికి తీవ్రగాయాలయ్యాయి. వీరిని 108లో ఆళ్లగడ్డ ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా భర్త రామాంజనేయులు చికిత్స పొందుతూ మృతి చెందారు. సమాదానమ్మ చికిత్స పొందుతున్నారు. పట్టణ ఎస్ఐ వెంకటరెడ్డి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ముగ్గురికి గాయాలు

సంజామల: ఆటో, మోటారు సైకిల్ ఢీకొన్న ఘటనలో అవుకు పట్టణానికి చెందిన ముగ్గురు గాయపడ్డారు. అవుకు పట్టణానికి చెందిన రవి, సాయి, మహేంద్ర ముగ్గురు మోటారు సైకిల్‌పై సంజామల మండలం ఆకుమళ్లకు వచ్చి తిరిగి వెళ్తుండగా సింగనపల్లె ఆకుమళ్ల మధ్యలో ప్రమాదం జరిగింది. రవికి కాళ్లు విరిగిపోయాయి. మరో ఇరువురు స్వల్పంగా గాయపడ్డారు. క్షతగాత్రులను 108 వాహనంలో బనగానపల్లె వైద్యశాలకు తరలించి అక్కడినుంచి మెరుగైన వైద్యం కోసం కర్నూలు వైద్యశాలకు తరలించారు. సంజామల పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

టీడీపీ జెండా ఎగురవేద్దాం

● చంద్రబాబుకు కానుకగా ఇద్దాం : గౌరు దంపతులు


మాట్లాడుతున్న గౌరు దంపతులు

కల్లూరు, జనవరి 8: పాణ్యం నియోజకవర్గంలో టీడీపీ జెండా ఎగురవేసి, టీడీపీ అధినేత చంద్రబాబుకు కానుకగా ఇద్దామని పాణ్యం టీడీపీ ఇన్‌చార్జి గౌరుచరిత, నందికొట్కూరు టీడీపీ ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి అన్నారు. సోమవారం స్థానిక మాధవీ నగర్‌లోని తమ స్వగృహంలో గౌరు దంపతులు సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో రైతులు క్రాప్‌హాలీడే ప్రకటిస్తున్నారని, సాగునీటి ప్రాజెక్టులకు వైసీపీ ప్రభుత్వం తిలోదకాలు ఇవ్వడమే అందుకు కారణమన్నారు. రైతులు పండించిన ధాన్యం కొనేదిక్కు లేక, మద్దతు ధర అందక, రైతన్నలు అప్పులపాలవుతున్నారని ఆరోపించారు. రాష్ట్రానికి జీవనాడి పోలవరాన్ని గోదావరిలో కలిపేశారని, జగన్‌కు నీటివిలువ తెలియదన్నారు. జిల్లాలో చెరువులను నింపి తాగు సాగు నీటికి ఇబ్బందులు లేకుండా చూస్తామన్న హామీ నేటికీ కలగానే ఉందని వైసీపీ తీరును ఎండగట్టారు. ఆయకట్టు రైతులు ఆశతో సాగుచేసిన పంటలు నీరులేక ఎండిపోయే పరిస్థితికి సీఎం జగన్ ఆలోచనా విధానమే కారణమన్నారు. రైతులకు 9 గంటల ఉచిత విద్యుత్ అందడం లేదన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో ఉన్న పథకాలను కట్‌చేసి, ఎస్సీ, ఎస్టీ, బీసీ సబ్‌ప్లాన్ నిదులను కాజేశారని ఆరోపించారు. రాష్ట్రంలో సంక్షేమం మరిచి సంక్షోభం మిగిల్చారన్నారు. రాష్ట్రానికి రావాల్సిన విభజన హామీలు, ప్రత్యేకహోదా ఏమైందని సీపీఎస్ రద్దు, మద్యపాన నిషేధం ఎక్కడ అంటూ గౌరు ప్రశ్నించారు. రాష్ట్రంలో జగన్ 95శాతం ప్రజల విశ్వాసాన్ని కోల్పోయారని ప్రజలు ఎన్నికల్లో చిత్తుచిత్తుగా వైసీపీని ఓడించేందుకు సిద్ధంగా ఉన్నారని గౌరు దంపతులు స్పష్టం చేశారు.

● ఆళ్లగడ్డలో మంగళవారం టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు తలపెట్టిన రా కదలి రా... కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పాణ్యం టీడీపీ ఇన్‌చార్జి గౌరుచరిత, నందికొట్కూరు టీడీపీ ఇన్‌చార్జ్ గౌరు వెంకటరెడ్డి టీడీపీ నాయకులు, కార్యకర్తలు పిలుపునిచ్చారు. గౌరు దంపతులు సోమవారం తమ స్వగృహంలో మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధి కోసం అహర్నిశలు కష్టపడి పనిచేస్తున్న చంద్రబాబును ఆదర్శంగా తీసుకుని టీడీపీ శ్రేణులు పనిచేయాలన్నారు. పాణ్యం, గడివేముల, ఓర్వకల్లు, కల్లూరు రూరల్, అర్బన్ నుండి టీడీపీ నాయకులు, కార్యకర్తలు రా కదలి రా కార్యక్రమానికి పెద్దఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పాణ్యం నియోజకవర్గ పరిశీలకులు మాజీ ఎమ్మెల్యే అత్తర్ చాంద్‌భాషా, కల్లూరు అర్బన్ అబ్జర్వర్ శివబాల, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ పెరుగు పురుషోత్తంరెడ్డి, తెలుగు యువత రాష్ట్ర ప్రదాన కార్యదర్శి మ॥ప్రభాకర్‌యాదవ్, పాణ్యం వాణిజ్య విభాగం అధ్యక్షుడు బ్రాహ్మనపల్లె నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి

కర్నూలు(న్యూసిటీ), జనవరి 8: నగర పాలక సంస్థ, మున్సిపాలిటీల్లోని హెల్త్, ఇంజనీరింగ్ విభాగాలలో వివిధ కేడర్లలో పని చేస్తున్న అప్కాస్, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని వైఎస్ ఆర్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు వైవి.రమణ డిమాండ్ చేశారు. సోమవారం కార్పొరేషన్ వద్ద కమిషనర్ ఏ. భార్గవతేజను కలిసి సమస్యలను వివరించారు. రమణ మాట్లాడుతూ ఇంజనీరింగ్ విభాగంలో పని చేస్తున్న అప్కాస్ కార్మికులకు 2021 పెండింగ్‌లో ఉన్న సరెండర్ లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ ఇవ్వాలన్నారు. జీపీఎఫ్‌పై విధి విధానాలు లేకుండా వాయిదాలు వేయడం సరికాదన్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వడంతో పాటు డీఏ.హెచ్‌ఆర్‌ఏ వర్తించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు ఎంవి.రమణ, స్వాములు, చిన్నయ్య, లక్ష్మి, పద్మ, రేణుక పాల్గొన్నారు.

సబ్‌స్టేషన్ ఏర్పాటుకు స్థల పరిశీలన

కర్నూలు(న్యూసిటీ), జనవరి 8: నగర పాలక సంస్థ పట్టణ ప్రణాళిక అధికారులు టిడ్కో ఇళ్ల వద్ద విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటు కోసం స్థలాన్ని పరిశీలించారు. సోమవారం డిప్యూటీ సీటీ ప్లానర్ మోహన్‌కుమార్, అసిస్టెంట్ సీటీ ప్లానర్‌తో కలిసి టిడ్కో సమీపంలో స్థలాన్ని పరిశీలించారు. త్వరలో ఇక్కడ సబ్‌స్టేషన్ నిర్మాణం కోసమే స్థలాన్ని పరిశీలించామని డీసీపీ తెలిపారు. ఆయన వెంట టీపీఎస్ హరీష్‌చౌదరి, సర్వేయర్ మేఘాశ్యామ్ ఉన్నారు.

● నగరంలోని రామలింగేశ్వర్‌నగర్‌లో రోడ్డుని ఆక్రమించుకుని నిర్మించుకున్న ర్యాంప్‌ను టీపీఎస్ మంజుల తన సిబ్బందితో కూల్చివేయించారు. రోడ్డుని ఆక్రమించారని లోకాయుక్తలో ఫిర్యాదు చేయడంతో కూలగొట్టామని మంజుల తెలిపారు.

టీడీపీ కార్యదర్శిగా టి. రాజేష్


కార్యదర్శి నియామక పత్రం ఇస్తున్న బీటీ నాయుడు

కర్నూలు(అర్బన్), జనవరి 8: టీడీపీ కర్నూలు నియోజకవర్గం కార్యదర్శిగా టి. రాజేష్‌ను నియమిస్తూ ఎమ్మెల్సీ, జిల్లా అధ్యక్షులు బీటి నాయుడు నియామక పత్రం అందజేశారు. సోమవారం టీడీపీ జిల్లా కార్యాలయంలో నియామకం పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నియోజవర్గం ఇన్‌చార్జీ టీ జీ భరత్ సూచనల మేరకు నియామకం జరిగిందని పెర్కొన్నారు.

చెన్నై క్రికెట్ పోటీలకు క్లస్టర్ విద్యార్థులు

కర్నూలు(అర్బన్), జనవరి 8: ఈనెల 7 నుంచి 16 వరకు చెన్నైలోని హిందుస్తాన్ సౌత్ జోన్ అంతర్ విశ్వవిద్యాలయాల జట్టులో ఆడేందుకు క్లస్టర్ యూనిర్సిటీ విద్యార్థులు వెళుతున్నారని ఉపకులపతి డా. వీఆర్ సాయిగోపాల్ తెలిపారు. పురుషుల క్రికెట్ పోటీల్లో మొదటి సారిగా క్లస్టర్ యూనివర్సిటీ విద్యార్థుల క్రికెట్ జట్టు పాల్గొంటున్న విద్యార్థులను అభినందించారు. ఉత్తమ ప్రతిభ కనపరిచి యూనివర్సిటీకి పేరు తీసుకురావాలని అకాంక్షించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డి. శ్రీనివాసులు, పిడీ వై. శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వాళ్లు వెళ్లిపోయినా నష్టమేమీ లేదు..

ఓర్వకల్లు జనవరి 7: పాలకోల్లు గ్రామానికి చెందిన సుధాకర్ రెడ్డి, సర్పంచులు సుజాతమ్మ, వెంకటరమణ, ఎంపీటీసీ శేషమ్మ వైసీపీని వీడి టీడీపీ చేరినా పార్టీకి నష్టమేమి లేదని వైసీపీ నాయకుడు, కర్నూలు మార్కెట్ యార్డ్ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి అన్నారు. సోమవారం ఓర్వకల్లులో ఆయన మాట్లాడతూ తమ నాయకులపై లేని పోని ఆరోపణలు చేయడం తగదన్నారు. డీఆర్‌డీవో భూములు కోల్పోయిన రైతలకు రూ.11కోట్లు అందించిన ఘనత ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డికే దక్కిందన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ రంగనాథ్‌గౌడ్, ఎంపీపీ తిప్పన్న, నాయకులు లోటర్ బాషా, చెన్నా రెడ్డి, హరినాథ్‌రెడ్డి, మహేశ్వర రెడ్డి మండలంలోని వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

ముందస్తు సంక్రాంతి సంబరాలు


ముగ్గు వేస్తున్న విద్యార్థినులు

ఓర్వకల్లు జనవరి 8: ఓర్వకల్లులోని బాల భారతి పాఠశాలలో సోమవారం ముందస్తు సంక్రాంతి సంబరాలు ఘనంగా జరుపుకొన్నారు. విద్యార్థినులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యాక్రమంలో ప్రిన్సిపాల్ క్లైమెంట్ సత్యబాబు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన రజక యూత్


మౌర్యఇన్‌లో టీడీపీలో చేరిన నాయకులు

కర్నూలు(అర్బన్), జనవరి 7: వచ్చే ఎన్నికల్లో టీడీపీ విజయానికి అందరూ కృషి చేయాలని టీడీపీ నియోజకవర్గం ఇన్‌చార్జి టీజీ భరత్ అన్నారు. సోమవారం నగరంలోని మౌర్యఇన్ హోటల్‌లో కర్నూలు సిటీ రజక యూత్ అధ్యక్షుడు సూర్యనారాయణ అధ్వర్యంలో టీడీపీలో చేరారు. టీజీ భరత్ మాట్లాడుతూ టీడీపీ గెలిస్తే అందరికి సంక్షేమ పథకాలు అందుతాయని తెలిపారు. కార్యక్రమంలో చిన్న, హరి, షాలు, శ్రీనివాస్, శివ, మహేష్, బన్నీ, అఖిల్, అంజి ఉన్నారు.

మహిళ అరెస్టు

ఆదోని రూరల్, జనవరి 8 : సాదాపురం గ్రామంలో కర్ణాటక మద్యాన్ని విక్రయిస్తున్న మహిళా పద్మావతిని తాలుకా పోలీసులు అరెస్టు చేశారు. సోమవారం కర్ణాటక మద్యాన్ని విక్రయిస్తున్న మహిళను అదుపులో తీసుకొని ఆమె వద్ద నుండి 200 కర్ణాటక మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ ఎర్రిస్వామి తెలిపారు.

ఎస్మా ప్రయోగిస్తే పునాదులు పెకలిస్తాం

● 28వ రోజుకు చేరిన అంగన్‌వాడీ సమ్మె ● ప్రజా సంఘాల నాయకుల మద్దతు


కర్నూలులో ఉరివేసుకొని నిరసన తెలియజేస్తున్న కార్మికులు


గూడూరులో మాట్లాడుతున్న నిర్మల

కర్నూలు, జనవరి 8: ఎస్మా చట్టాన్ని తమపై ప్రయోగిస్తే రాష్ట్రంలోని వైసీపీ ప్రభుత్వ పునాదులు లేకుండా చేస్తామని అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు హెచ్చరించారు. న్యాయబద్ధమైన డిమాండ్లతో దిక్కులేని పరిస్థితుల్లో రోడ్డెక్కిన తమను అణచివేసే కుట్ర జరుగుతుందన్నారు. సమస్యలు పరిష్కరించే వరకు వెనక్కు తగ్గేది లేదని స్పష్టం చేశారు. కనీస వేతనాల అమలుతో పాటు గ్రాట్యుటీ పెంపే లక్ష్యంగా అంగన్‌వాడీలు జిల్లా వ్యాప్తంగా కొనసాగిస్తున్న నిరసన కార్యక్రమాలు, రిలే దీక్షలు సోమవారానికి 28 రోజుకు చేరింది. కర్నూలు నరగంలో సోమవారం అంగన్‌వాడీ సిబ్బంది ఉరివేసుకొని వినూత్నంగా నిరసన తెలియజేశారు. ప్రభుత్వ వ్యతిరేక నినాదాలు చేశారు. తమ సమస్యలను పరిష్కరిస్తేనే పోరాటం వీడతామని స్పష్టం చేశారు. ప్రజా సంఘాల నాయకులు మద్దతు తెలిపారు. ప్రభుత్వం అంగన్‌వాడీ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

గూడూరు: అంగన్‌వాడీ మహిళలను రోడ్డు పాలు చేసిన ఘనత జగన్ ప్రభుత్వానిదే సీఐటీయూ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పి. నిర్మల, బి. రామాంజనేయులు, డివైఎఫ్ఐ జిల్లా నాయకులు హుసేన్‌బాషా, సీఐటీయూ డివిజన్ కార్యదర్శి జె మోహన్ అన్నారు. సోమవారం అంగన్‌వాడీల సమ్మె గూడూరులో 28వ రోజుకు చేరుకుంది. కార్యక్రమానికి సీఐటీయూ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పి. నిర్మల, బి. రామాంజనేయులు, డివైఎఫ్ఐ జిల్లా నాయకులు హుసేన్‌బాషా అంగన్‌వాడీ కార్మికులకు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకురాలు అరుణ, ఇందుమతి, రత్నమ్మ, సుజాత, మంజుల, మహేశ్వరి, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

బీసీలను అణగదొక్కిన జగన్ ప్రభుత్వం

నంద్యాల (నూనెపల్లె), జనవరి 8: రాష్ట్రంలోని బీసీలను వైసీపీ ప్రభుత్వం అణగదొక్కిందని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు ఎన్ఎండీ ఫరూక్, కాల్వ శ్రీనివాసులు అన్నారు. నంద్యాలలోని జిల్లా టీడీపీ కార్యాలయం ఆవరణలో సోమవారం జయహో బీసీ ప్రచార రథాలను ప్రారంభిస్తారు. ఎన్ఎండీ ఫరూక్, కాల్వ శ్రీనివాసులు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు మాల్లెల రాజశేఖర్, బీసీ సాధికార కమిటీ రాష్ట్ర కన్వీనర్ వై.నాగేశ్వరరావు యాదవ్, నంద్యాల పార్లమెంట్ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి, మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ చౌదరి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు ఏవీఆర్ ప్రసాద్, వెదుర్ల రామచంద్రారావు, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదరి ఎన్ఎండీ ఫిరోజ్, తదితరులు హాజరయ్యారు. మాజీ మంత్రులు ఎన్ఎండీ ఫరూక్, కాల్వ శ్రీనివాసులు జెండాలు ఊపి జయహో బీసీ ప్రచార రథాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలోని బీసీలపై వైసీపీ గుండాలు దాడులకు పాల్పడి చివరికి వారి ప్రాణాలను తీశారని మండిపడ్డారు. బీసీలకు సంక్షేమం, అన్ని రంగాలలో అభివృద్ధి చేసిన ఘనత ఒక్క చంద్రబాబుదేనని స్పష్టం చేశారు. కార్యక్రమంలో టీడీపీ బీసీ సాధికార కమిటీల రాష్ట్ర, జిల్లా నాయకులు, జనసేన పార్టీ నాయకులు పాల్గొన్నారు.

అర్జీలను సమర్థవంతంగా పరిష్కరించండి: కమిషనర్


స్పందనలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కమిషనర్ ఏ.భార్గవతేజ

కర్నూలు(న్యూసిటీ), జనవరి 8: జగనన్నకు చెబుదాం-స్పందన అర్జీల పరిష్కారంలో అసంతృప్తి లేకుండా సమర్థవంతంగా పరిష్కరించాలని నగర పాలక సంస్థ కమిషనర్ ఏ.భార్గవతేజ అన్నారు. సోమవారం కార్యాలయంలోని కౌన్సిల్ హాలులో ప్రజా సమస్యల పరిష్కార వేదిక జగనన్నకు చెబుదాం-స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వచ్చిన ఫిర్యాదులు మళ్లీ వస్తున్నాయని, వాటిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులను ఆదేశించారు. అర్జీదారులను సచివాలయాలకు పిలిపించుకుని పరిష్కారానికి సంబంధించిన ఎండార్స్‌మెంట్ వారి చేతికి ఇచ్చినట్లు రశీదును పొందాలని అన్నారు. అయితే కొందరు వాటిని పాటించడం లేదని కమిషనర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సరస్వతి నగర్, ప్రేమనగర్‌లో సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మించాలని, తుంగభద్రకాలనీ, ఏపీ హెచ్‌బీ కాలనీలలో మురుగునీటి వ్యవస్థ నిర్మించాలని, టిడ్కో ఇళ్లలో గృహము కేటాయించాలని చత్రిబాగ్‌కు చెందిను మహేశ్వరిలు కమిషనర్‌కు అర్జీలు అందజేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ పివి.రామలింగేశ్వర్, డిప్యూటి సిటి ప్లానర్ మోహన్‌కుమార్, మెడికల్ హెల్త్ ఆఫీసర్ కే.విశ్వేశ్వరరెడ్డి, మేనేజర్ చిన్నరాముడు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడి మృతి

సి. బెళగల్, జనవరి 8: సి.బెళగల్‌లో టీడీపీ కార్యకర్త లోకయ్య అనే వ్యక్తి మృతి చెందాడు. సోమవారం టీడీపీ మాజి మండల కన్వీనర్ తిమ్మప్ప, దస్తగిరి, భీమన్న, నాగరాజు వారి కుటుంబాన్ని సోమవారం పరామర్శించారు. టీడీపీ నాయకుడు దస్తగిరి మాట్లాడుతూ టీడీపీ పార్టీ అవిర్భవించినప్పటి నుంచి పార్టీ అభివృద్ధి కోసం కృషి చేశారని, ఆయన మృతి చెంది పార్టీకి తీరని లోటు అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు రాజు, గఫూస్, రంగన్న తదితరులు ఉన్నారు.

రైతులు రీ సర్వేకు సహకరించాలి

సి. బెళగల్, జనవరి 8: రైతులు రీసర్వేకు సహకరించాలని తహసీల్దార్ శేషఫణి కోరారు. సోమవారం తహసీల్దార్ మాట్లాడుతూ మండలంలోని గుండ్రేవుల, కొండాపురం, కొత్తకోట గ్రామాలలో చేపట్టిన రీసర్వే జరుగుతుందన్నారు. రైతులు రీసర్వేలో పొలం తక్కువగా వస్తుందని జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసుకున్నారన్నారు. రీసర్వే ద్వారా పూర్తి వివరాలు తెలుసుకోవచ్చునని, రైతులకు అన్యాయం జరగదని తహసీల్దార్ తెలిపారు.

విగ్రహావిష్కరణను జయప్రదం చేయండి

కల్లూరు, జనవరి 8: భారత రాజ్యాంగ నిర్మాత, పేద బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి డా.బీఆర్. అంబేడ్కర్ విగ్రహావిష్కరణ, స్మృతివనం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం తన కార్యాలయంలో ఆయన కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. విజయవాడలో రూ.400 కోట్లతో ఏర్పాటు చేసిన డా.బీఆర్ అంబేడ్కర్ విగ్రహం జనవరి 19న ప్రారంభించడం జరుగుతుందన్నారు. ఈ కార్యాక్రమానికి కార్యకర్తలు తరలివచ్చి విజయవంతం చేయాలని కాటసాని కోరారు.

'సమస్యలు పరిష్కరించకుంటే సీఎం ఇంటిని ముట్టడిస్తాం'


ఒంటికాలిపై నిలబడి నిరసన తెలియజేస్తున్న కార్మికులు

కర్నూలు(కల్చరల్), జనవరి 8: మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించకుంటే సీఎం ఇంటిని ముట్టడిస్తామని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్ మునెప్ప అన్నారు. ఏపీ మున్సిపల్ వర్కర్ల యూనియన్ (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో నగరంలోని మున్సిపల్ కార్యాలయం ముందు సోమవారం ఒంటి కాలిపై నిలబడి తమ నిరసన తెలియజేశారు. మునెప్ప మాట్లాడుతూ మున్సిపల్ పారిశుధ్య కార్మికుల సమస్య పరిష్కరించాలని గత నెలలో సమస్యలపై ప్రభుత్వానికి సమ్మె నోటీసు ఇవ్వడం జరిగిందని, కానీ సమ్మెలో భాగంగా మంత్రులతో చర్చించి సమస్యలు పరిష్కరిస్తామని చెప్పిన ప్రభుత్వం కాలయాపన చేస్తోందని విమర్శించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నగర కార్యదర్శి జి చంద్రశేఖర్, యూనియన్ నాయకులు మాణిక్యం, సవారి, శాలూ, ఏసన్న, శివ, ఎల్లప్ప, రాధ, సుజాత తదితరులు పాల్గొన్నారు.

లద్దగిరిలో అంబేడ్కర్‌కు నివాళి


అంబేడ్కర్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న దృశ్యం

కోడుమూరు (రూరల్), జనవరి 8: మండలంలోని లద్దగిరి సచివాలయంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి సిబ్బంది నివాళి అర్పించారు. సామాజిక న్యాయ మహాశిల్పం సంతకాల సేకరణలో భాగంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. పంచాయితీ కార్యదర్శి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాణంలో అంబేడ్కర్ కృషిని వివరించారు. నేటి సుపరిపాలనలో అంబేడ్కర్ పాత్ర ఎంతో ఉందన్నారు. అనంతరం ఫ్లెక్సీపై సంతకాలు సేకరించి వీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. విజయవాడలో 19న జరిగే అంబేడ్కర్ విగ్రహావిష్కరణలో పాల్గొనే వారు తమ పేర్లను సచివాలయంలో నమోదు చేసుకోవచ్చున్నారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

డిప్యూటీ తహసీల్దారు మృతి

ఉయ్యాలవాడ, జనవరి 8: డిప్యూటీ తహసీల్దారు బబ్బూరి వెంకట స్వామి అనారోగ్యంతో మృతి చెందారు. ఈయన కొంత కాలంగా క్యాన్సర్‌తో బాధపడుతూ సోమవారం మృతి చెందారు. 2018లో సీనియర్ అసిస్టెంట్‌గా ఉయ్యాలవాడకు వచ్చారు. అనంతరం 2020లో డిప్యూటీ తహసీల్దారుగా పదోన్నతి పొందారు. విషయం తెలిసిన వెంటనే తహసీల్దారు రవికుమార్ సిబ్బందితో కలిసి మృత దేహాన్ని సందర్శించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. మంగళవారం ఉదయం వారి స్వగ్రామైన దొర్నిపాడు మండలంలోని రామచంద్రా పురంలో అంత్యక్రియలు నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

ఒక్క చాన్స్‌తో రాష్ట్రం సర్వనాశనం

ప్యాపిలి, జనవరి 8: ఒక్క చాన్స్‌తో సీఎం జగన్ రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారని, మరో అవకాశం ఇస్తే ఏపీని బంగాళాఖాతంలో కలుపుతారని టీడీపీ నంద్యాల పార్లమెంటు ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని చంద్రపల్లి గ్రామంలో నిర్వహించిన బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన టీడీపీ డోన్ ఇన్‌చార్జి ధర్మవరం సుబ్బారెడ్డి, టీడీపీ రాష్ట్ర బీసీ సాధికార సమితి కన్వీనర్ వై నాగేశ్వరరావుయాదవ్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో శివానందరెడ్డి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను జగన్ ఏ మాత్రం నెరవేర్చలేదన్నారు. ఉపాధి లేక యువత ఇతర రాష్ట్రాలని వలస పోవలసి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. వచ్చే ఎన్నికల్లో ఉమ్మడి కర్నూలు జిల్లాలోని రెండు పార్లమెంటు స్థానాలను, అసెంబ్లీ స్థానాలను టీడీపీ కైవాసం చేసుకుంటుదని మాండ్ర ధీమా వ్యక్తం చేశారు.

ఓటమి భయంతోనే బీసీల రాగం: బీవీ


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర్‌రెడ్డి

ఎమ్మిగనూరు, జనవరి 7: వచ్చే ఎన్నికల్లో ఓటమి భయంతోనే సీఎం జగన్ బీసీల రాగం ఎత్తుకున్నారని మాజీ ఎమ్మెల్యే జయనాగేశ్వర రెడ్డి అన్నారు. 'జయహో బీసీ' కార్యక్రమంలో భాగంగా సోమవారం ఎమ్మిగనూరు మండలం దైవందిన్నె గ్రామంలో బీసీ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం బస్టాండ్ వద్ద నిర్వహించిన సభలో బీవీ మాట్లాడుతూ బీసీల పక్షపాతి అని చెప్పుకుంటున్నారని, అయితే 2014, 2019లో ఎమ్మిగనూరు నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసినప్పుడు బీసీలు గుర్తుకు రాలేదా? అని ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డిపై నిప్పులు చెరిగారు. నేడు నీవు ఓడిపోతావని జగన్మోహన్ రెడ్డి చెప్పారంటే.. ఎవరి చేతిలో ఓడిపోతావని చెప్పారని ప్రశ్నించారు.మరి నేడు ఎమ్మెల్యేకు వయోభారం, తన కొడుకు సీటు రాదని తేలడంతో ఉన్నట్టుండి బీసీలు గుర్తుకొచ్చారంటూ విమర్శించారు. వైసీపీ పాలనలో రైతులను విస్మరించారని, అన్న క్యాంటీన్‌ను లేకుండా చేసి పేదల కడుపు కొట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. సర్వే పేరుతో భూములు కొట్టేయాలని చూస్తున్నారని ఆరోపించారు. బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు సత్రం రామకృష్ణ, మాజీ ఎంపీపీ వాల్మీకి శంకరయ్య, మండల నాయకులు సోమేశ్వరరెడ్డి, పార్లపల్లి మల్లికార్జున, వెంకటేష్, పార్టీ గ్రామ అధ్యక్షుడు నాగేష్ పాల్గొన్నారు.

భువనేశ్వరి పర్యటనను విజయవంతం చేద్దాం

● మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు


ఏర్పాట్లను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు


గోనెగండ్లలో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

ఆదోని, జనవరి 8 : నిజమే-గెలవాలి కార్యక్రమంలో భాగంగా మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సతీమణి నారా భువనేశ్వరి మంగళవారం రాత్రి ఆదోనికి రానున్నారని, ఈ పర్యటనను విజయవంతం చేద్దామని మాజీ ఎమ్మెల్యే మీనాక్షీనాయుడు కార్యకర్తలకు పిలుపునిచ్చారు. సోమవారం మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ రాత్రి చేకూరి ఫంక్షన్ హాల్‌లో బస చేయనున్నారని, అందుకు సంబంధించిన ఏర్పాట్లను నారా ప్రశాంత్‌తో కలిసి పర్యవేక్షించామన్నారు. సీఎం జగన్ ప్రభుత్వం అక్రమంగా అరెస్టు చేసి జైల్లో పెట్టడాన్ని తట్టుకోలేక జిల్లాలో కోడుమూరు, పత్తికొండ, మంత్రాలయం, ఎమ్మిగనూరు నియోజవర్గాల్లో 15 మంది టీడీపీ కార్యకర్తలు గుండె పగిలి మృతి చెందారని, మృతి చెందిన కార్యకర్తల ఇళ్లకు నేరుగా వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి పార్టీ తరఫున ఆర్థిక సాయం అందజేస్తారని తెలిపారు. కార్యకర్తలు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. బాపట్ల శ్రీధర్, రాబిన్ శర్మ, టీమ్ సభ్యులు, టీడీపీ నాయకులు బసాపురం రామస్వామి, రంగస్వామి నాయుడు, యువ నాయకులు మారుతినాయుడు, తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి వెంకటేష్ చౌదరి ఏర్పాట్లను పరిశీలించారు.

గోనెగండ్ల: నారా భువనేశ్వరి చేపట్టిన 'నిజం గెలవాలి' కార్యక్రమంలో భాగంగా ఈనెల 10న గోనెగండ్ల మండలంలో ఆమె పర్యటనను విజయవంతం చేయాలని టీడీపీ మండల నాయకులు పిలుపునిచ్చారు. సోమవారం పార్టీ కార్యాలయంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. వారు మట్లాడుతూ రేపు గోనెగండ్ల మండలంలోని అలువాల, ఎర్రబాబు, అగ్రహారం గ్రామాల్లో నారా భువనేశ్వరి పర్యటిస్తారని చెప్పారు. గత ఏడాది స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో చంద్రబాబు అక్రమ అరెస్టును తట్టుకోలేక మనోవేదనకు గురై గోనెగండ్ల మండలంలో ముగ్గురు కార్యకర్తలు మృతి చెందారని, వారి కుటుంబాలను పరామర్శిస్తారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు తిరుపతయ్యనాయుడు, బేతాలబడేసా, రమేష్‌నాయుడు, రంగస్వామినాయుడు, అడ్వకేట్ చంద్రశేఖర్, నూరహమ్మద్, బారతం రహంతుల్లా, ఫక్రుద్దీన్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీల నిరసన


అంగన్‌వాడీల సమ్మెకు మద్దతు తెలుపుతున్న ఏపీయూడబ్ల్యూజే నాయకులు


ఆదోనిలో అంగన్‌వాడీ సమ్మెకు మద్దతు తెలుపుతున్న గుడిసె కృష్ణమ్మ


మంత్రాలయంలో సమ్మె చేస్తున్న అంగన్‌వాడీ కార్మికులు


పెద్దకడబూరులో జీవో కాపీలను దహనం చేస్తున్న దృశ్యం

ఎమ్మిగనూరు రూరల్, జనవరి 7: సమస్యల పరిష్కారం కోసం అంగన్‌వాడీలు చేస్తున్న ఆందోళన ఎమ్మిగనూరులో 28వ రోజు సోమవారం ఉధృతంగా సాగింది. ఐసీడీఎస్ కార్యాలయానికి వైఎస్ఆర్ కిట్ల ఖాళీ బ్యాగుల లోడుతో వెళ్తున్న వాహనాన్ని అంగన్‌వాడీలు, హెల్పర్లు అడ్డుకున్నారు. వాహనం ముందు బైఠాయించి నినాదాలు చేశారు. దీంతో చేసేది లేక వాహనాన్ని డ్రైవర్ వెనక్కి తీసుకెళ్లాడు. అలాగే అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇచ్చారు. సీఐటీయూ, ఏఐటీయూసీ, ఐఎఫ్‌టీయూ, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు మాట్లాడుతూ న్యాయమైన సమస్యలను పరిష్కరించకుండా 28 రోజులుగా సమ్మె చేస్తున్న అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించలేని సీఎం జగన్ అంగన్‌వాడీలపై ఎస్మా చట్టాన్ని ప్రయోగిస్తు జీఓ 2ను విడుదల చేయటం దుర్మార్గమన్నారు.

● అంగన్‌వాడీల సమ్మెకు కార్మిక, ప్రజా సంఘాలు మద్దతు తెలిపాయి. ఐఎఫ్‌టీయూ నాయకులు, కార్మికులు సమ్మె శిబిరానికి వచ్చి అంగన్‌వాడీలకు మద్దతు తెలిపారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం ముందు ధార్నా చేశారు. అలాగే ఏపీయూడబ్ల్యూజే తాలుకా, పట్టణ కమిటీల ఆధ్వర్యంలో అంగన్‌వాడీలకు మద్దతు తెలిపారు. సంఘం అధ్యక్ష కార్యదర్శులు శ్రీనివాసులు, నాగరాజు, పరమేష్, నూర్ అహ్మద్, బాషా, రామకృష్ణ, నాగరాజు, బాబురాజు, వెంకటేష్, రవి, బాలాజీ, రవి, సీ.నాగరాజు, ఎల్లయ్య రెహమాన్, సునీల్, వీరేష్, ఈరన్న, రవికుమార్, హరి పాల్గొన్నారు.

ఆదోని: అంగన్‌వాడీలకు రూ.26 వేలు కనీస వేతనం అమలు చేయాలని ఫుడ్ కమీషన్ మాజీ సభ్యురాలు గుడిసె కృష్ణమ్మ పేర్కొన్నారు. సోమవారం అంగన్‌వాడీ వర్కర్స్ సమ్మెకు గుడిసె కృష్ణమ్మ, అడ్వకేట్ బీజేపీ మహిళా నాయకురాలు సావిత్రి, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు టీ ఈరన్న, పట్టణ అధ్యక్ష కార్యదర్శులు తిప్పన్న, పీఎస్ గోపాల్, అధ్యక్షులు రామాంజనేయులు, ఏఐటీయూసీ నాయకులు వీరేష్ మద్దతు తెలిపారు. ఎస్మా చట్టాల జీవోను దహనం చేశారు. కార్యక్రమంలో సోమక్క, గీత, రేణుక, గీత, సోమేశ్వరి, శారద పాల్గొన్నారు.

ఆస్పరి: నేరాలు చేసిన వ్యక్తులపై ప్రయోగించాల్సిన ఎస్మా చట్టాన్ని అంగన్‌వాడీలపై ప్రయోగించడం ఎంతవరకు సమంజసమని, తక్షణమే ఎస్మా చట్టాన్ని ప్రభుత్వం రద్దు చేయాలని అంగన్‌వాడీ కార్యకర్తలు డిమాండ్ చేశారు. సోమవారం ఆస్పరి అంబేడ్కర్ సర్కిల్లో అంగన్‌వాడీల రాస్తారోకో నిర్వహించారు. దీంతో కర్నూలు, బళ్లారి, ఆదోని, పత్తికొండ వైపు వెళ్లే రోడ్డులో రాస్తారోకో నిర్వహించారు. ఏఐటీయూసీ, సీఐటీయూసీ మండల నాయకులు విరుపాక్షి, హనుమంతు మాట్లాడుతూ అంగన్‌వాడీల న్యాయమైన కోర్కెలను పరిష్కరించడంలో వైసీపీ ప్రభుత్వం విఫలం చెందిందని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో కృష్ణమూర్తి, రామాంజనేయులు, రాజశేఖర్, ఉరుకుందప్ప, బ్రహ్మయ్య పాల్గొన్నారు.

పెద్దకడుబూరు: పెద్దకడబూరులోని ఆదోని ప్రధాన రహదారిలో జీవో నెం2 ప్రతులను సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీలు దహనం చేశారు. ఎస్మా చట్టాన్ని ప్రయోగించడం సరికాదని అన్నారు.

మంత్రాలయం: మంత్రాలయం ఐసీడీఎస్ కార్యాలయం ముందు అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె 28వ రోజు కొనసాగింది. ఏఐఎస్ఎఫ్ నాయకులు మద్దతు తెలిపారు.


'యువత చేతుల్లోనే దేశ భవిష్యత్తు'


స్వామి వివేకానంద చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న దృశ్యం

కౌతాళం, జనవరి 8: దేశాభివృద్ధి యువత చేతుల్లోనే ఉందని కౌతాళం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం ఇమ్మానియేల్, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సంతోష్‌కుమార్ అన్నారు. ఏబీవీపీ ఆధ్వర్యంలో సోమవారం యువజన దినోత్సవాన్ని పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ముందుగా స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఏబీవీపీ మండల అధ్యక్షుడు శివాజీ, కన్వీనర్ అశోక్ నాయకులు పరశురాం, వినోద్, శివ, అంజి పాల్గొన్నారు.

జీవో ప్రతుల దహనం

14వ రోజుకు చేరిన మున్సిపల్ కార్మికుల సమ్మె


ధర్నా చేస్తున్న కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు

ఎమ్మిగనూరుటౌన్, జనవరి 7: మున్సిపల్ కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికులు చేపట్టిన సమ్మె సోమవారం 14వ రోజుకు చేరుకుంది. పట్టణంలోని సోమప్ప సర్కిల్‌లో కార్మిక సంఘాల ఐకాసా ఆధ్వర్యంలో జీవో ప్రతులను దహనం చేశారు. కార్యక్రమంలో నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

మాచాని వెంకటేష్ అభ్యర్థిత్వాన్ని సీఎం ప్రకటించారు

ఎమ్మిగనూరు, జనవరి 7: బీసీ సమాజిక వర్గానికి సీటు కేటాయిస్తామని చెప్పటంతో ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి పట్టణానికి చెందిన మాచాని వెంకటేష్‌ను సీఎం జగన్ దగ్గరకు తీసుకెళ్లారని, దీంతో ఆయనను అభ్యర్థిగా సీఎం జగన్ ప్రకటించారని వైసీపీ సీనియర్ నాయకులు ఎర్రకోట జగన్మోహన్ రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని ఎంపీపీ కార్యలయంలో మున్సిపల్ ఛైర్మన్ డా.రఘు, వైఎస్‌ఛైర్మన్ నజీర్, ఎంపీపీ కేశన్న, పట్టణ, మండల నాయకులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గత కొన్ని రోజులుగా తాను, తమ కార్యకర్తలు అలిగామని, అసంతృప్తిలో ఉనాన్నమని ప్రచారం జరుగుతోందన్నారు. తన కుమారుడి వివాహం ఉండడంతో ఎమ్మిగనూరుకు రాలేకపోయానన్నారు. సమావేశంలో సమన్వయకర్త మాచాని వెంకటేష్, నాయకులు యుకే రాజు, షబ్బీర్, సునీల్ కుమార్, రామకృష్ణారెడ్డి, కోటేకల్ లక్ష్మన్న, దేవేంద్ర గౌడ్, వెంకటరామిరెడ్డి, నటరాజ్ రెడ్డి, కేశవరెడ్డి, పెద్దయ్య, వాహీద్ పాల్గొన్నారు.

వ్యవసాయ కూలీలు వలస బాట

గోనెగండ్ల, జనవరి 8: మండలంలోని గాజులదిన్నె, గోనెగండ్ల, కులుమాల, హెచ్ కైరవాడి, అగ్రహారం, బైలుప్పల, చిన్నమరివీడు, గంజహళ్లి, పెద్దమరివీడు తదితర గ్రామాలకు చెందిన కూలీలు గుంటూరు, హైదరాబాదు, తెలంగాణ, విజయవాడ, రాయచూరు, ప్రాంతాలకు వలస బాట పట్టారు. ఆది, సోమవారాలలో దాదాపు 50 కుటుంబాలు గుంటూరు పత్తి పొలంలో కూలీ పనులకు బయలుదేరాయి. స్థానికంగా పొలం పనులు లేకపోవడంతో వలస పోతున్నట్లు కూలీలు తెలుపుతున్నారు.

సభా ప్రాంగణం పరిశీలన


సభ ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న అధికారులు

నందవరం, జనవరి 8: కేంద్ర మంత్రి సత్యపాల్ సింగ్ బాగాల్ బుధవారం నందవరానికి రానున్నట్లు ఎంపీడీవో దశరథరామయ్య తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని సభా ప్రాంగాణాన్ని పరిశీలించారు. వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా మంత్రి వస్తున్నట్లు తెలిపారు.

వలసలను నివారించండి

ఆలూరు, జనవరి 8 : జిల్లాలో అన్ని మండలాలకు కరువు ప్రాంతం నిధులు కేటాయించి, కరువు నుంచి రైతులను, కూలీలను ఆదుకోవాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బీ కృష్ణ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ భాస్కర్ యాదవ్, జనరల్ సెక్రెటరీ భూపేష్ కోరారు. సోమవారం జిల్లా కేంద్రంలో కలెక్టర్ సృజనకు వినతిపత్రం అందించారు. గ్రామాలలో జాతీయ ఉపాధి హామీ పనులు మొదలుపెట్టి, ప్రతి ఒక్కరికి 200 రోజులు పనిదినాలు కల్పించి, రోజు కూలి రూ.600 ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా సమితి సభ్యులు కోడుమూరు తిమ్మప్ప, జిల్లా కమిటీ నాయకులు ఎం హర్షవర్ధన్ రెడ్డి, వెంకట్రామిరెడ్డి, మల్లికార్జున పాల్గొన్నారు.

దీక్షలకు కాంగ్రెస్ నాయకుల సంఘీభావం


సంఘీభావం తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

ఆదోని టౌన్, జనవరి 8: రైల్వేలో పనిచేస్తున్న ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కాంగ్రెస్ పార్టీ ఆదోని ఇన్‌చార్జి దేవిశెట్టి ప్రకాష్ డిమాండ్ చేశారు. ఆదోని రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ చేపట్టిన నిరాహారదీక్షకు సోమవారం కాంగ్రెస్ పార్టీ మద్దతు తెలుపుతూ, తమ సంఘీభావం ప్రకటించారు. ఆయన మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం రైల్వే సంస్థను ప్రైవేటీకరణ చేయడంతో పాటు, వారి పాత పెన్షన్ విధానాన్ని కూడా రద్దు చేయడం ఏమాత్రం సమంజసం కాదని అన్నారు. గతంలో కాంగ్రెస్ హయంలో కేంద్రంలో ఉండగా, రైల్వేకు ప్రత్యేక బడ్జెట్ కేటాయిస్తూ, అనేక అభివృద్ధి కార్యక్రమాలతో పాటు, కార్మిక ఉద్యోగ సంఘాల సమస్యలను పరిష్కరించడం జరిగిందని అన్నారు. ఆదోని రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ నాయకులు ఖలందర్ రెడ్డి, శ్రీనివాసులు, వాసు, దివాకర్, నరసింహులు ఆధ్వర్యంలో దీక్ష చేపట్టారు. ఐఎన్‌టీయూసీ నాయకుడు జయరాం, ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి తాయన్న, మండల అధ్యక్షుడు నెట్టేకల్ హనుమంతు, మైనారిటీ అధ్యక్షుడు ఖలందర్, మెహబూబ్ బాష, శేఖర్ మద్దతు తెలిపారు.

కార్మికుల బైఠాయింపు

ఆదోని టౌన్, జనవరి 8 : పురపాలక పారిశుధ కార్మికుల సమ్మెలో భాగంగా సోమవారం ఏఐటీయూసీ పట్టణ ప్రధాన కార్యదర్శి వెంకన్న, జిల్లా సమితి సభ్యుడు కల్లుబావి రాజు ఆధ్వర్యంలో కాంట్రాక్ట్ కార్మికుల సంఘం కార్మికులు కార్యాలయం ముందు బైఠాయించి, ప్రభుత్వానికి వ్యతిరేఖంగా నినాదాలు చేశారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు అజయ్‌బాబు మాట్లాడుతూ వారం రోజులుగా కార్మికులు సమ్మె చేస్తున్నా, ప్రభుత్వం పట్టించుకోకపోవడం ఎంతో దారుణమని విమర్శించారు. కార్మిక సంఘం నాయకులు లక్ష్మణ్ణ, జాన్ బాబు, శేఖన్న, అర్జున్, నామాల జయరాజు, ఓబులేషు, సుశీలమ్మ, నాగమ్మ, ఐసీ లక్ష్మీ, ఆదిలక్ష్మీ పాల్గొన్నారు.

మహిళ అరెస్టు

ఆదోని రూరల్, జనవరి 8 : సాదాపురం గ్రామంలో కర్ణాటక మద్యాన్ని విక్రయిస్తున్న మహిళా పద్మావతిని తాలుకా పోలీసులు అరెస్టు చేశారు. సోమవారం కర్ణాటక మద్యాన్ని విక్రయిస్తున్న మహిళను అదుపులో తీసుకొని ఆమె వద్ద నుండి 200 కర్ణాటక మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ ఎర్రిస్వామి తెలిపారు.

వాల్మీకి యువ గర్జనను జయప్రదం చేయండి

ఆదోని రూరల్, జనవరి 8 : కర్నూలులో జరిగే వాల్మీకి యువగర్జనను జయప్రదం చేయాలని వాల్మీకి నాయకులు తిక్కన్న, నీలకంఠప్ప, సాయిప్రసాద్‌లు కోరారు. సోమవారం వారు మాట్లాడుతూ, హలో వాల్మీకి ఛలో కర్నూలులో భాగంగా 20న వాల్మీకి యువగర్జన కార్యక్రమం ఉంటుందని, కావున కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. వాల్మీకులు ఐక్యతతో ముందుకెళ్తే దేనైనా సాధించవచ్చన్నారు. అనంతరం వాల్ పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో వెంకటేష్, దస్తగిరి నాయుడు, వీరేష్, రామాంజిని, తదితరులు పాల్గొన్నారు.

'గంజాయిని అరికట్టాలి'

ఎమ్మిగనూరు రూరల్, జనవరి 7: ఎమ్మిగనూరు పట్టణంలో విచ్చలవిడిగా సరఫరా అవుతున్న గంజాయిని అరికట్టాలని విద్యార్థి, ప్రజాసంఘాల నాయకులు సోమవారం డీఎస్పీ సీతారామయ్యకు వినతిపత్రం ఇచ్చారు. నాయకులు రాజేష్, ఉదయ్, ఖదీర్, ఇస్మాయిల్, సురేష్ మాట్లాడుతూ ఇటీవల కాలంలో ఎమ్మిగనూరు పట్టణంలో గంజాయి సరఫరా అవుతోందని, దీన్ని విద్యార్థులు, యువకులు తీసుకొని వ్యసనాలకు బానిసలు అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు గంజాయి సరఫరాపై ప్రత్యేక నిఘా ఉంచి అరికట్టాలని కోరారు. నాయకులు వినోద్, ఆకాష్, రఘు, అభి పాల్గొన్నారు.

'ఆటో కార్మికులకు జీవన భృతి ఇవ్వాలి'


తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న ఆటో కార్మికులు

ఎమ్మిగనూరు రూరల్, జనవరి 7: జగనన్న ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తే ఆటో కార్మికులకు రూ.12 వేలు జీవన భృతి ఇవ్వాలని సీఐటీయూ నాయకులు గోవిందు, రాముడు, ఆటోవర్కర్స్ యూనియన్ నాయకుడు రాజు డిమాండ్ చేశారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. వారు మాట్లాడుతూ ఉచిత బస్సు సౌకర్యాన్ని వ్యతిరేకించడం లేదన్నారు. ఆటో రంగంపై ఆధారపడి జీవిస్తున్నామని, అయితే ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తే తమను ఆదుకోవాలని కోరారు. అనంతరం తహసీల్దార్ ఆంజనేయులుకు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణ, ఆది, రాజు, రమేష్, అబ్దుల్ పాల్గొన్నారు.

విజయవంతం చేయాలి: తిక్కారెడ్డి

మంత్రాలయం, జనవరి 8: మంత్రాలయం నియోజకవర్గంలో మంగళవారం నారా భువనేశ్వరి పర్యటన ఖరారైందని, విజయవంతం చేయాలని టీడీపీ మంత్రాలయం నియజకవర్గ ఇంచార్జి పాలకుర్తి తిక్కారెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరి 10 న బుధవారం మంత్రాలయం నియోజకవర్గంలో పర్యటన ఉండాల్సి ఉండగా ఒకరోజు ముందుగా 9న మంగళవారం మార్పు చేసినట్లు తెలిపారు. మంగళవారం మధ్యాహ్నం పెద్దకడబూరు మండలం, అనంతరం కౌతాళం మండలం, సాయంత్రం మంత్రాలయం పట్టణంలో సాగుతుందని తెలిపారు. పెద్దకడబూరు, కౌతాళం, మంత్రాలయం, కోసిగి మండలాల నుంచి టీడీపీ నాయకులు, క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్‌చార్జిలు అనుబంధ కమిటీ నాయకులు, ఎన్టీఆర్, బాలకృష్ణ అభిమానులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. చంద్రబాబు జైలులో ఉన్నప్పుడు ఆవేదనతో మృతి చెందిన వారి కుటుంబాలను పరామర్శించి ఆర్థిక సాయం అందజేస్తారని తెలిపారు.

అభివృద్ధికి నోచుకోని ముస్లిం మైనార్టీ కాలనీ


సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న గుడిసె కృష్ణమ్మ

ఆదోని, జనవరి 8 : ఆదోని మునిసిపాలిటీ పరిధిలోని 40వ వార్డు మైనారిటీ కాలనీలో కనీస వసతులు కూడా లేవని ఫుడ్ కమిషన్ మాజీ సభ్యురాలు గుడిసె కృష్ణమ్మ అన్నారు. సోమవారం సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. టీజీఎల్ కాలనీ నుంచి మైనారిటీ కాలనీ వరకు రహదారి ఏర్పాటు చేయాలన్నారు. కాలనీలో విద్యుత్ దీపాలు అమర్చాల ని, నూతనంగా డ్రైనేజీలు ఏర్పాటు చేయాలని, 200 పైగా కుటుంబాలు ఉన్నప్పటికీ, మైనారిటీ పిల్లల చదువుకోడానికి ఉర్దూ స్కూల్, అంగన్‌వాడీ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని, తాగునీటి కోసం పైప్‌లైన్‌లు వేయాలన్నారు.

హాస్టల్ విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలి


సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న టీఎన్ఎస్ఎఫ్ నాయకులు

ఆదోని (అగ్రికల్చర్), జనవరి 8 : పట్టణంలోని ఎస్సీ హాస్టల్ నెంబర్-3 విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని టీఎన్ఎస్ఎఫ్ జిల్లా అధికార ప్రతినిధి బోయ తేజ కోరారు. సోమవారం ఆదోని సబ్ కలెక్టర్ శివ నారాయణశర్మను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు మంజు, సోము, చరణ్, ప్రదీప్, విష్ణు పాల్గొన్నారు.

మాజీ సైనికుడు మహేష్‌కు న్యాయం చేయండి


ఎంపీ సంజీవ్ కుమార్‌కు వినతిపత్రం అందిస్తున్న మాజీ సైనికులు

ఆలూరు, జనవరి 8: ఆలూరు చెందిన మాజీ సైనికుడు ప్రభుత్వం ఇచ్చిన భూమిని తగ్గించి, మరో వ్యక్తి భూమిలో కలిపి మహేష్‌కు అన్యాయం చేశారని డిఫెన్స్ వెటరన్స్ ఆర్గనైజేషన్ నేషనల్ జనరల్ సెక్రెటరీ ఎన్ శ్రీనివాసులు, మాజీ సైనికులు సోమవారం కర్నూలు కలెక్టర్ సృజన, ఎంపీ సంజీవ్ కుమార్‌ను కలిసి వినతిపత్రం అందించారు. 2011లో 2.96 ఎకరాల ల్యాండ్ సీలింగ్ ఇచ్చిందని, రెవెన్యూ అధికారులు మహేష్ భూమిలోని 53 సెంట్లు గుండప్ప అలియాస్ ప్రభాకర్ భూమిలో కలిపారని, ఈ విషయంలో న్యాయం చేయాలని విన్నవించుకున్నా న్యాయం జరగలేదన్నారు. పరిశీలించిన వారు న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. ఆయన వెంట ఆలూరు తాలూకా అధ్యక్షుడు శివప్రసాద్, రామాంజినేయులు, వెంకటేశ్వర్లు, ఖాజా హుసేన్, వేణుగోపాల్ పాల్గొన్నారు.

'విలేకరిపై దాడి చేసిన వారిని అరెస్టు చేయాలి'

ఎమ్మిగనూరు రూరల్, జనవరి 7: పట్టణంలోని రాఘవేంద్ర కాలనీలో నివాసం ఉంటున్న ఎలక్ట్రానిక్ మీడియా విలేకరిపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఏపీయూడబ్ల్యూజే నాయకులు కోరారు. సోమవారం పట్టణంలోని డీఎస్పీ సీతారామయ్యను కలిసి వినతిపత్రం ఇచ్చారు. వారు మాట్లాడుతూ రెండు రోజుల క్రితం వెంకటేష్‌పై దాడికి పాల్పడటమే కాకుండా తిరిగి కేసు పెట్టారన్నారు. పూర్తిస్థాయిలో విచారణ జరిపి దాడికి పాల్పడిన వారిని వెంటనే అరెస్టు చేయాలని కోరారు. కార్యక్రమంలో అధ్యక్ష కార్యదర్శులు శ్రీనివాసులు, నాగరాజు, నాయకులు బాషా, బాబురాజు, వెంకటేష్, రామకృష్ణ, నాగరాజు, నాగభూషణం, వెంకటేష్, రవి, రెహమాన్, ఎల్లయ్య, నాగరాజు, ఈరన్న పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యలపై నిరంతర పోరాటం


గోనెగండ్లలో మొక్కలు నాటుతున్న ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిమ్మన్న

గోనెగండ్ల, జనవరి 8: ఉపాధ్యాయుల సమస్యలపై ఎస్టీయూ సంఘం నిరంతరం పోరాటం చేస్తుందని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిమ్మన్న అన్నారు. ఎస్టీయూ వజ్రోత్సవాల సందర్బంగా లక్ష మొక్కలు నాటే కార్యక్రమంలో భాగంగా గోనెగండ్లలో సోమవారం ఉన్నత పాఠశాలలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. సంఘం నాయకులతో పాటు ఎంఈవో రామాంజినేయులు, నీలకంఠ కూడా పాఠశాల అవరణంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీధర్, మండల నాయకులు రాఘవేంద్రుడు, చంద్రశేఖర్, గోవర్ధన్, భస్కర్‌ఉస్మాన్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ


సీసీ రోడ్డుకు భూమి పూజ చేస్తున్న నాయకులు

మంత్రాలయం, జనవరి 8: మండలంలోని చెట్నహళ్లి గ్రామల్లో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులకు టీటీడీ బోర్డు సభ్యులు సీతారామిరెడ్డి భూమిపూజ చేశారు. సోమవారం గ్రామ సర్పంచ్ బెస్త అంజినేయులు, వైస్ సర్పంచ్ వీరనాగప్ప, ఎంపీటీసీ రామాంజినేయులు ఆధ్వర్యంలో సీసీ రోడ్ నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. అనంతరం మరుగు కాలువ పనులను పరిశీలించారు. గుర్రెడ్డి భీమిరెడ్డి, ఎస్ఐ వేణుగోపాల్ రాజు, మాజీ సర్పంచ్ అల్లింగప్ప తదితరులు పాల్గొన్నారు.